# ప్రభాత సమాచారం

ఆదిలాబాద్ Digital Edition

https: epaper.prabhathasamacharam.com

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ ఆదివారం | 21 సెప్టెంబర్ 2025 | ■ 21 పేజీలు




ఉద్యమమే ఊపిరిగా

## కొండా లక్ష్మణ్ బాపూజీ

- మూడు ఉద్యమాలను ముద్దాడిన యోధుడు లక్ష్మణ్ బాపూజీ
- ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో 1915లో జన్మించిన బాపూజీ
- నేడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

నిరంకుశ నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడైన కొండాలక్ష్మణ్ బాపూజీ ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబరు 27న జన్మించాడు. స్వాతంత్ర్య ఉద్యమంలో మరియు నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నాడు. 1952లో ఆసిఫాబాద్ నుంచి ఎన్నికై 1971 వరకు శాసనసభ్యునిగా కొనసాగారు. 12లో



ఇక వాకిళ్లు

## పూదోటలు..

మహిళలు ఆనందోత్సాహాలతో, ఆచార సంప్రదాయాలతో వేడుకగా జరుపునే పూలపండుగ 'బతుకమ్మ' తెలగాణ జీవనానికి నిలువెత్తు సాక్ష్యం.. చరిత్రలో విభిన్నమైన పూలను కొలిచే ఆచారం బతుకమ్మ పండుగలోనే ఉండటం విశేషం.. ప్రకృతిలో సేకరించిన పూలను తిరిగి ప్రకృతికే సమర్పించడం బతుకమ్మ వైశిష్టానికి నిదర్శనం.. నిత్యనూతనమై, బంగారు సిరులొలికించే ప్రకృతి పండుగ బతుకమ్మను మహిళలు భక్తి పారవశ్యంతో జరుపుకోవడం ఆనవాయితీ. అశ్వయుజ శుద్ధ అమావాస్య రోజు నుంచి మహర్నవమి వరకు తొమ్మిది రోజులు జరుపుకునే పూల పర్వానికి నేడు మహిళలు ఎంగిలిపూల బతుకమ్మతో శ్రీకారం చుట్టి తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో అమ్మవారిని కొలవనున్నారు.





తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేది, ఆడబిడ్డలకు ఇష్టమైన పండుగ బతుకమ్మ, ఎంగిలిపూల నాటి నుంచి మహిళలు చేసే సందడి అంతా ఇంతాకాదు.. పూలు తేవడం, బొడ్డెమ్మలను పేర్చడం, సాయంత్రం ఆడటం.. ఇలా తొమ్మిది రోజుల పాటు తెలంగాణ లోగిళ్లల్లో కోలాహలం ఉంటుంది. పూల రూపంలో ప్రకృతిని, స్త్రీశక్తిని ఆరాధించే విశిష్టమైన పండుగ బతుకమ్మ. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాసం ముందు అమావాస్య రోజు నుంచి ఆడబిడ్డలు బతుకమ్మ పండుగ చేసుకుంటారు. తొమ్మిది రోజులు పూలతో అలంకరించి బతుకమ్మను పేరుస్తారు. పంటపొలాల్లో సీజనల్‌గా దొరికే సాధారణ పూలనే బతుకమ్మను పేర్చేందుకు వాడతారు. ప్రకృతితో మమేకమై పర్యావరణహితంగా చేసుకునే పండుగ. చిన్నా-పెద్ద, పేద-ధనిక అనే తేడా లేకుండా అందరూ కలిసి తన్మయత్వంతో గౌరమ్మను ఆరాధిస్తారు.

- బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో..
- నేటి నుంచి బతుకమ్మ సంబురాలు షురూ
- తొమ్మిది రోజుల పాటు సందడే సందడి
- ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగింపు
- రోజుకో విధమైన నైవేద్యం సమర్పణ ■ మహిళలు ఇష్టంగా నిర్వహించుకునే పండగ
- పల్లె.. పట్టణం అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ఏర్పాట్లు
- పాఠశాలల్లో పూల పండుగ ■ ఉమ్మడి జిల్లాలో ముందస్తు బతుకమ్మ వేడుకలు
- ఆడిపాటిన ఉపాధ్యాయులు, విద్యార్థినులు ■ సంప్రాదాయ దస్తుల్లో ఆకట్టుకున్న చిన్నారులు




2

## ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ

- నానో యూరియాతో ప్రయోజనాలెన్నో ■ రైతులకు తక్కువ శ్రమ... ఖర్చు...
- అవగాహన కల్పిస్తున్న అధికారులు ■ సాంప్రదాయ యూరియా కంటే మేలు..

రైతులకు ప్రస్తుతం యూరియా కొరత తీవ్రంగా ఇబ్బందులు కలిగిస్తోంది. ఎరువుల కోసం గంటల తరబడి క్యూల్లో నిలబడి చివరికి ఖాళీచేతులతో ఇంటికి చేరుతున్న పరిస్థితి. పంటల నిలువ, దిగుబడులపై ప్రభావం చూపుతుందనే ఆందోళన కమ్ముకుంది. సాంప్రదాయ యూరియాపై రైతులు అలవాటు, అవగాహనలేమి కారణంగా మార్కెట్‌లో ఉన్న నానో యూరియాపై ఇంకా పూర్తిగా నమ్మకం కలగడం లేదు. నిజానికి ఒక్క బాటిల్ నానో యూరియానే ఒక సంచి సాంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయం. పైగా తక్కువ ధర, సులభమైన రవాణా, సమర్థవంతమైన వినియోగం లాంటి లాభాలు రైతులకు ఎంతో మేలు చేస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పండుగ

## రద్దీ షురూ

- దసరాకు ప్రత్యేక బస్సులు
- ఆరు ఆర్టీసీ డిపోల నుంచి 414 సర్వీసులు
- నేటి నుంచి అక్టోబర్ వరకు నడుపనున్న అధికారులు
- 50మంది ఉంటే ప్రత్యేక బస్సు
- ప్రయాణికుల ఇబ్బందులు కలగకుండా అధికారుల చర్యలు





21

## నవరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- నవరాత్రులకు సర్వం సిద్ధం..
- తొమ్మిది రోజులు... తొమ్మిది రూపాల్లో దర్శనమివ్వనున్న అమ్మవారు
- మూల నక్షత్రానికి ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి
- వెల్లడించిన ఆలయ ఈఓ అంజన దేవి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చదువుల తల్లి కొలువైన బాసర శ్రీజ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి ఆలయంలో శారదియా నవరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈవో అంజనా దేవి తెలిపారు. శనివారం ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 22 సోమవారం నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు.



పచ్చని కుటుంబంలో

## మద్యం పెట్టిన చిచ్చు

- భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త
- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం నారాయణపూర్‌లో ఘటన..

అర్ధరాత్రి బ్లాక్

## మార్కెట్‌కు యూరియా

- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కృత్రిమ కొరత సృష్టిస్తున్న ప్రైవేట్ డీలర్
- లారీని సీజ్ చేసిన పోలీసులు



# ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ

- నానో యూరియా ప్రయోజనాలివే
- తక్కువ శ్రమ... ఖర్చు...
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు






**ముథోల్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
రైతులకు ప్రస్తుతం యూరియా కొరత తీవ్రంగా ఇబ్బందులు కలిగిస్తోంది. ఎరువుల కోసం గంటల తరబడి క్యూల్లో నిలబడి చివరికి ఖాళీచేతులతో ఇంటికి చేరుతున్న పరిస్థితి. పంటల నిలువ, దిగుబడులపై ప్రభావం చూపుతుందనే ఆందోళన కమ్ముకుంది. సాంప్రదాయ యూరియాపై రైతులు అలవాటు, అవగాహనలేమి కారణంగా మార్కెట్‌లో ఉన్న నానో యూరియాపై ఇంకా పూర్తిగా నమ్మకం కలగడం లేదు. నిజానికి ఒక్క బాటిల్ నానో యూరియానే ఒక సంచి సాంప్రదాయ యూరియాకు ప్రత్యామ్యాయం. పైగా తక్కువ ధర, సులభమైన రవా ణా, సమర్ధవంతమైన వినియోగం లాంటి లాభాలు రైతులకు మేలుచేస్తాయని అధికారులు చెబుతున్నారు. రైతులు ఇంకా సాంప్రదాయ యూరియానే పట్టుకోవడంతో కొరత తీవ్రరూపం దాల్చింది. నానో యూ రియాపై అవగాహన పెంచి, రైతుల నమ్మకం పెంచకపోతే యూరియా కష్టాలకు పుల్‌స్టాఫ్ పడేటట్లు కనిపించడం లేదు.

పంటకు నత్రజని అందించే యూరియా ఇప్పటి వరకు రైతులకు పరిచయం. ప్రతిపంట సాగులో యూ రియా ప్రధాన భూమిక పోషిస్తుంది. యూరియా లేకుండా వ్యవసాయం అనేది ఊహించలేము. అందుకే రైతుల జీవనంలో భాగంగా నిలిచింది. ప్రత్యామ్నాయం గా కనుక్కున్న నానో యూరియా రైతులకు వరంగా ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. ఎకరానికి 45–50 కేజీల వరకు సాంప్రదాయ యూరియాను వేసినా, అందులో కేవలం 30–40శాతం మాత్రమే పంటలకు అందుతోంది. మిగతాభాగం వృథా అవుతూ నేల ఆరోగ్యం దెబ్బతినడం, నీటికాలుష్యం పెరగడం, వాయుకాలుష్యం సృష్టించడం జరుగుతుంది. రైతుజేబుకు కూడా బరువైపోతుంది. ఇక ఈ సమస్యలకు చెక్‌పెడుతూ శాస్త్రవేత్త లు రూపొందించిన నానో యూరియా వ్యవసాయ రం గంలో సంచలనంగా మారింది. కేవలం 500మిల్లీలీటర్ల ఒక బాటిల్‌తో ఎకరానికి సరిపోతుంది. ఆకులపై పిచికారి చేయగానే నానో కణాలు నేరుగా మొక్కలోకి చేరి 80శాతం వరకు నత్రజని శోషింపచేస్తాయని నిపుణు లు పేర్కొంటున్నారు.

**తక్కువ శ్రమ... ఖర్చు...**
సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియాతో రైతుఖర్చులు గణీయంగా తగ్గుతాయి. 50కేజీ బస్తా రూ. 170 వరకు ఉంది. కొనుగోలు కేంద్రం నుంచి ఇంటికి నుంచి పొలానికి రవాణా కష్టంతో కూడుకున్న ది. అదే అరలీటర్ నానోయూరియా బాటిల్ ధర రూ. 100–130 వరకు ఉంది. రవాణా, ప్రయోగించడం సుల భం. ఎకరానికి 50 కేజీల ఎరువుకు బదులుగా కేవలం ఒక బాటిల్ సరిపోవడం వల్ల రవాణా, కార్మిక ఖర్చుల తగ్గించుకోవచ్చు. పర్యావరణానికి మేలు సాంప్రదాయ యూరియా వృథా అవడం వలన కలిగే కాలుష్యం తగ్గి పోతుంది. భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూస్తాయి. గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలు కూడా గణనీయంగా తగ్గుతాయి. వ్యవసాయరంగంలో నూతన శకంగా నిపుణులు సూచిస్తారు. పంట దిగుబడులు పెంచడమే కాకుండా ఖర్చు తగ్గించి రైతులకు రెండు విధాలుగా లాభం కలుగుతుందని పలువురు అధికారులు అభిప్రాయపడుతున్నారు. నేలలో వేసే




ప్రారంభ సమయంలో సంప్రదాయ యూరియా వాడుకొని మొక్కపెరిగిన తర్వాత మాత్రం నానో యూరియా వాడాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. యూరియా ఒక్కటే కాదు డీఏపీ, పొటాషలు కూడా బస్తాలతో పోలిస్తే ద్రవరూపంలో అతి తక్కువ ధరలో లభిస్తున్నా యి. ఆసక్తి ఉన్న రైతులు స్థానికంగా ఉన్న ప్రభుత్వ వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే పూర్తి వివరాలను వినియోగ పద్దతులు తెలియజేసే అవకాశం ఉంటుంది.

**రైతులకు అవగాహన కల్పించాలి...**
నానోయూరియా గురించి తెలియక రైతులు సాంప్రదాయ యూరియాని మర్చి పోలేకపోతున్నారు. విస్తృతంగా అవగాహన కల్పించాలి. రైతులకు నమ్మకం కలిగించాలి. క్రమేపి రైతులు నానోవైపు అలవాటు పడే అవకాశం ఉంది.

# జాతీయ రహదారి పనులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష




**నిర్మల్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
జాతీయ రహదారుల నిర్మాణాలు రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో జాతీయ రహదారుల నిర్మాణ పనులు, భూసేకరణ సమస్యలు, పెండింగ్ మ్యుటేషన్, ఫారెస్ట్ క్లియరెన్స్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, నేషనల్ హైవేస్, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మాణాలతో రవాణా సౌకర్యాల అభివృద్ధితో పాటు వాణిజ్య, పారిశ్రామిక రంగాలు పురోగమిస్తాయని తెలిపారు. రహదారుల నిర్మాణాలు జరుగుతున్నా జిల్లాల్లో భూసేకరణ, మ్యుటేషన్, అటవీ అనుమతుల ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పూర్తయిన రహదారులతో పాటు, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పరిహారం చెల్లింపులు, మ్యుటేషన్ తదితర అంశాలను వేగవంతం చేయాలన్నారు. ఎటువంటి కారణాలతోనూ రోడ్ల నిర్మాణంలో ఆటంకాలు తలెత్తకూడదని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లాల వారీగా భూసేకరణ స్థితిగతులను ప్రధాన కార్యదర్శి చర్చించారు. భూసేకరణ సమస్యలు, న్యాయపరమైన ఇబ్బందులు, పరిహారం చెల్లింపులు, రికార్డుల అప్‌డేషన్ వంటి అంశాలపై కలెక్టర్లు వివరాలు సమర్పించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, డిఎఫ్ఓ నాగిని భాను పాల్గొన్నారు.



## పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి

### ఎంపీఈఓ సురేష్ చందర్ గౌడ్

**లోకేశ్వరం, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీఈవో సురేష్ చందర్ గౌడ్ సూచించారు. ఇటీవల ఎంపీఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శనివారం మండలంలోని నగర్, పిప్రి, గడ్ చందా, బామ్ని (కె) గ్రామాల్లో పర్యటించారు. ముందుగా గ్రామపంచాయతీల్లో రికార్డులను పరిశీలించి కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. మురుగు కాలువలను తరచూ శుభ్రం చేయించాలని, పనిచేయని వీధి దీపాలకు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అలాగే హరితహారం నర్సరీల్లో మొక్కలు చనిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆయనతోపాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ముందస్తు బతుకమ్మ సంబరాలు

**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
రామకృష్ణాపూర్ పట్టణంలోని పలు ప్రవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.చిన్నారులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ సంబరాలను ఆటపాటలతో అలరింప చేశారు. పాఠశాల ఆవరణలో బతుకమ్మ సంబురాలు కోలాహలంగా కొనసాగాయి.ఈ సందర్భంగా తవక్కల్ పాఠశాలల యజమాని అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా జరుపుకునే బతుకమ్మ సంబురాలు విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని నింపాయి.

## స్వస్థ నారి శ్వాశక్తి ఆరోగ్య శిబిరం

**ఇచ్చోడ, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
శనివారం మండలంలోని ఆడే గామ గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో అడేగామా (బి) గ్రామంలో స్వస్థ నారి శ్వాశక్తి పరివార్ వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. అందులో భాగంగా అడిగామా,బి గ్రామంలో 1 డెంగ్యూ వ్యాధి రావడంతో వాళ్ళ ఇంట్లో వాళ్లకి ఆరోగ్య పరీక్షలుచేసి ఇంటి చుట్టూ పక్క ఇళ్ళలో ప్రైమత్రిన స్ప్రే చేశారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు జలుబు దగ్గు జ్వరమును గుర్తించి మందులు పంపిణీ చేయడం జరిగింది. మధుమేహం, వ్యాధులను గుర్తించి మందులు ఇవ్వడం జరిగింది. గర్భిణీ స్త్రీలు సక్రమంగా మందులు వాడాలని చెప్పడం జరిగింది మరియు వర్షాకాల నేపథ్యంలో ఇంటిచుట్టూ నీళ్లు, ట్యాంకులు, కొబ్బరి చిప్పలు పూల కుండీలలో నిల్వ ఉన్న



నీటిలలో దోమల లార్వా లను గుర్తించి పారబోశారు. అలాగే దోమల ద్వారా వచ్చే వ్యాధులు డెంగ్యూ,మలేరియా ,చికెన్ గునియా, లాంటి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. పరిసరాలుపరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ అవినాష్ రాథోడ్, సి ఎచ్ ఓ బ్రహ్మానందరెడ్డి, ఎస్‌యుఓ పవార్ రవీందర్, ఎంఎల్‌ఎచ్‌పీ హరిత, పీఎచ్ఎన్ రాజుబాయి, రాథోడ్ కైలాష్, సుభాష్, వసంత్, సుభాష్ ,మరియుఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

**మామడ, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎంపీఓ ఉపేందర్ అన్నారు. శనివారం మండలంలోని గాయుద్‌పల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించి, పారిశుద్ధ్యం లోపించకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇండ్ల నిర్మాణానికి విడుదల వారీగా డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరీష్, తదితరులు పాల్గొన్నారు.



## బీరప్ప ఆలయాన్ని ధ్వంసం చేసిన దుండగులు

**లోకేశ్వరం, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
గొల్ల కురుమల ఆరాధ్య దైవం బీరప్ప ఆలయాన్ని గుర్తు తెలియని దుండగులు శుక్రవారం ధ్వంసం చేసిన ఘటన లోకేశ్వరం మండలంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాయపూర్ కాండ్లి గ్రామ శివారులో గత రెండేళ్ల క్రితం నిర్మించిన బీరప్ప ఆలయాన్ని గుర్తుతెలియని దుండగులు ఆలయం పైకి ఎక్కి గోపురాన్ని ధ్వంసం చేశారు. పంటచేలకు వెళ్లిన రైతులు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వారు లోకేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



# రైతులకు యూరియా కష్టాలు



**జన్నారం, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** మండల కేంద్రంలో రైతులు రోడ్డెక్కారు.. సరిపడా యూరియా అందించాలని జన్నారంలోని రైతులు మన గ్రోమోర్ షాపు ముందు ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం రాస్తారోకో చేశారు. ఉదయం నుంచి యూరియా కోసం పడిగాపులు కాసిన ఒక్క బస్తా కూడా ఇవ్వడం లేదన్నారు. ఒక్క పాస్ బుక్కుకు ఒకే యూరియా బస్తా ఇస్తే ఎలా సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు రైతులతో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సర్దిచెప్పడంతో రైతులు రాస్తారోకో కార్యక్రమాన్ని విరమించుకున్నారు. వేమనపల్లి మండలంలోని నీల్వాయి సహకార సంఘం గోదాం వద్ద శనివారం యూరియా కోసం ఎండలో బారులు తీరుతూ రైతులు ఇబ్బందిపడ్డారు. 225 బస్తాలు పంపిణీ చేశారు. ఇంకా 300 మంది రైతులకు అందకపోవడంతో అధికారులను నిలదీశారు. భీమారం మండల కేంద్రానికి 2394 బస్తాల వివిధ సెంటర్లు, ఫర్టిలైజర్ షాపులకు సరఫరా చేశారు. పోలీస్ పహారా మధ్య గ్రోమర్ సెంటర్, రైతు వేదిక వద్ద రైతులకు ఏవో అత్తే సూధాకర్ ఆధ్వర్యంలో టోకెన్లు అందించారు. పాత తహసీల్ కార్యాలయం వద్ద రైతులు బారులు తీరి యూరియా బస్తాలను తీసుకెళ్లారు.

**బెజ్జూర్ మండలంలో...**

అన్నదాతలకు యూరియా కష్టాలు తీరడం లేదు. అదను దాటుతున్నా యూరియా బస్తాలు అందక పోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రోజుల తరబడి గంటల కొద్ది క్యూలైన్లలో నిలబడ్డప్పటికీ ఒక్క బస్తా యూరియా దొంకక అవస్థలు పడుతున్నారు. శనివారం బెజ్జూరు మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్‌కు యూరియా బస్తాలు రావడంతో వ్యవసాయాధికారులు యూరియా పంపిణీ చేపట్టారు. ఒక్కో రైతుకు కేవలం ఒకటి రెండు బస్తాలు మాత్రమే ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపిణీ కేంద్రం వద్ద ఎస్సై సర్ధాజ్ పాషా బందో బస్తు ఏర్పాటు చేశారు.

**దహెగాం మండలంలో...**

యూరియా బస్తా కోసం రైతులకు కష్టాలు తప్పడం లేదు.



అదనుదాటిపోతున్నా వర్షాలు కురిస్తే ఎరువులు వేసుకోవచ్చని రైతులు యూరియా కోసం బారులు తీరారు. రైతులకు ఒకటి లేదా రెండు చొప్పున బస్తాలు ఇవ్వడంతో ఆవేదన చెందుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా యూరియా బస్తాల కోసం తిరుగుతున్నామని వాపోతున్నారు. శనివారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో 888, బీబ్రా ఆగ్రో రైతు సేవా కేంద్రంలో 333, గిరివెల్లి రైతు వేదిక వద్ద 88 యూరియా బస్తాల పంపిణీ చేసిపట్లు ఏఓ రామకృష్ణ తెలిపారు.



## దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

### అందజేసిన ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్

**ముథోల్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** పట్టణంలోని బృందావన్ గార్డెన్‌లో శనివారం దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హాజరై అర్హులైన దివ్యాంగ లబ్ధిదారులకు సహాయ ఉపకరణాల అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో అందరితో సమానంగా ఎదిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపరంగా అన్ని సదుపాయాలను కల్పిస్తామన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం సీపీ చైర్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిళ్లు, టీఎల్ఎం కిట్లు అందజేసిందన్నారు. రూ.47లక్షలు ఖరీదుచేసే ఉపకరణాలను అందజేశామన్నారు. ఇది కేవలం ఉపకరణాల పంపిణీ మాత్రమే కాదని, ఇది సాధికారత వైపు వేసిన ఒక గొప్ప అడుగని, ఈ పరికరాలు చైతన్యం, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయన్నారు.

## ఈవీఎం గోదాంలను తనిఖీ చేసిన కలెక్టర్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** ప్రతినెలా తనిఖీలలో భాగంగా శనివారం స్థానిక శాంతినగర్‌లోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, పలువురు ప్రధాన పార్టీల నాయకులతో కలిసి పరిశీలించారు. గోదాములలో ఈవీఎంలు సరిగా ఉన్నాయా లేదా ఏదైనా సమస్యలు తలెత్తాయా అన్న కోణంలో తనిఖీ చేసినట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఈవీఎం గోదాముల వద్ద ఉన్న భద్రతా సిబ్బందితో మాట్లాడి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలని, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ శ్యామల




దేవి, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు ఉన్నారు.

## విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



**గుడిహత్నూర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించాలని రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ సత్యరాజ్ ఉపారపు అన్నారు. గుడిహత్నూర్ మండలం లింగాపూర్‌లోని ప్రాథమికొన్నత పాఠశాలలో శనివారం కళాజాత బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య పాఠశాల అవగహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాజాత బృందం సభ్యులు విద్యార్థులకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగహన కల్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సత్యరాజ్ ఉపారపు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసరం గ్రామ పాఠశాలలో అవగహన కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. జిల్లా కలెక్టర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, ఆరోగ్యంగా ఉండాలని, విద్యార్థులకు వచ్చే సంక్రమిత, అసంక్రమిత వ్యాధులతో పాటు, సీజనల్ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చరణ్ సింగ్, కళాజాత బృందం సభ్యులు రవి, మురళి, దుర్పత, ఉపాధ్యాయులు మాధవి, పాఠశాల కమిటీ చైర్మన్ పోలె విష్ణు కాంత్ పాల్గొన్నారు.



## వరదల్లో, పండగల్లో జిల్లా అధికారుల పనితీరు భేష్!

### సున్నిత ప్రాంతాల్లోని ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు
### విశ్రాంతి భవనాన్ని అందుబాటులో ఉంచాలి
### ఉమ్మడి జిల్లా ఏఐఎంఐఎం అధ్యక్షుడు జాబిర్ హైమద్

**ముథోల్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** ఇటీవల సంభవించిన వరదలు, శాంతియుతంగా జరిగిన పండగల నేపథ్యంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల పనితీరు అభినందనీయమని ఏ.ఐ.ఎం.ఐ.ఎం ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అధ్యక్షులు, బైంసా మున్సిపల్ తాజా మాజీ వైస్ చైర్మన్ జాబిర్ హైమద్ అన్నారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు... బైంసా లాంటి సున్నీత ప్రాంతంలో ప్రజలు, అధికారులు సమన్వయం మెలగాలని అన్నారు. గతంలో శివాజీ చౌక్ ప్రాంతంలో శివాజీ విగ్రహ గద్దె నిర్మాణ ఏర్పాటు పనిలో భాగంగా యువకులు గుంతను ఏర్పాటు చేసుకోగా అట్టి గుంతను ఇక్కడి అధికారులు పూడ్చివేయాలంటూ మున్సిపల్ సిబ్బందికి ఆదేశించారని ఆరోపించారు. అలాగే వెంకటేశ్వర టెంపుల్ ప్రాంగణంలో అక్కడి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసుకున్నటువంటి షెడ్డుని సైతం ఇక్కడి అధికారులు తొలగించమన్నారని ఆరోపించారు. బైంసా లాంటి సున్నీత ప్రాంతంలో సమన్వయంతో ఉండి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అలాగే బైంసా మున్సిపల్ ప్రాపర్టీ విషయంలో సైతం ఇదే తంతు జరుగుతుందని ఆరోపించారు. నిమజ్జన వేడుకలు, ఇతరేతర కార్యక్రమాల నేపథ్యంలో అధికారులు, ప్రజానాయకులు సమావేశాల కోసం విశ్రాంతి భవనం ఉంది కానీ అక్కడే అధికారులు మాకాం వేయడానికి కాదని విమర్శించారు. 70 వేల మందికి ఉన్నటువంటి బైంసా తహసీల్ కార్యాలయానికి ప్రతిరోజు నిత్యం వందల మంది వచ్చి పోతుంటారని, అక్కడ కూడా పార్కింగ్, తాహసీల్ కార్యాలానికి వెళ్లే రూటుపై ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపించారు.

# తాగునీటి కోసం మహిళల నిరసన

### రహదారిపై ఖాళీ బిందెలతో ఆందోళన

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజక వర్గంలోని కాగజ్ నగర్ మండలం వంజీరి గ్రామ పంచాయతీ మహిళలు మంచినీటి ఎద్దడి తీర్చాలంటూ ఆందోళన చేపట్టారు. శనివారం ఫారెస్ట్ చెక్‌పోస్ట్ సమీపంలో ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించారు. గత కొన్ని రోజులుగా కుళాయిల ద్వారా నీటి సరఫరా లేక తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మహిళలు ఆరో పించారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో కోట ప్రసాద్ గ్రామస్థులతో మాట్లాడారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ట్యాంకరు ద్వారా నీటి సరఫరా చేస్తున్నప్పటికీ ధర్నా చేయడం సరికాదని, నీల్లు సరిపోకపోతే అదనంగా ట్యాంకర్లు ఏర్పాటు చేస్తామన్నారు. పంచాయతీ పరిధిలోని సిఆర్‌నగర్, మహజన్ గూడ గ్రామాల్లో బోరుబావులు లేనందున మంజూరు చేయించవలసినదిగా మహిళలు కోరారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసు కుంటామని ఎంపీడీవో భరోసాఇచ్చారు. రూరల్ సీఐ కుమారస్వామికి గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. అధికారుల స్పష్టమైన హామీతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. రెండు గంటల పాటు ట్రాఫిక్ అంతరం ఏర్పడింది.





## పాఠశాలలు, కళాశాలల్లో ముందస్తు

# బతుకమ్మ సంబరాలు

**మంచిర్యాల, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా మంచిర్యాల కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మను అలంకరించి, సంప్రదాయ గీతాల మధ్య ఆడి పాడుతూ ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్, మేనేజ్‌మెంట్ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**సారంగాపూర్ మండలంలో...**

మండల కేంద్రంలోని గల వివేకానంద హైస్కూల్, వింధ్య యుపిఎస్ స్కూల్‌ల్లలో ముందస్తు బతుకమ్మ సంబరాలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థిని విద్యార్థులు కోలాటం అట పాటలతో ఊరేగిస్తూ నృత్యాలు చేస్తూ బతుకమ్మ వేడుకలు చాలా ఘనంగా జరుపుకున్నారు. నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం పిల్లలు పాల్గొన్నారు.

**జన్నారం మండలంలో..**

జన్నారం మండలం కిష్టాపూర్‌లోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి విద్యార్థులకు సెలవులు కారణంగా పాఠశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురా లు అన్నారు కార్యక్రమంలో విద్యార్థుల రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ పాటలతో ఆడి పాడారు.

**ఉట్నూర్‌లో...**

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్ సింగ్ అన్నారు. బతుకమ్మ పండగ సంబరాల్లో భాగంగా శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యపకులు,సిబ్బంది, విద్యార్థునుకు బతుకమ్మ ఆడారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలోనంటూ ఆడుతూ పాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ నర్సింగ్ రావు, పెంటన్న, స్వామి, రాణి, అనిత, చంద్రశేఖర్, డాక్టర్ రవీందర్, రాజశేఖర్ కళాశాల సిబ్బంది ఉన్నారు.







# గొర్రెల కాపరులపై అటవీ అధికారుల వేధింపులు ఆపాలి



**మందమర్రి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

చెన్నూరు నియోజకవర్గంలో గొర్రెల మేకల కాపరులపై అటవీ అధికారుల వేధింపులు, దాడులు నిలిపివేయాలని కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు గుంట శ్రీశైలం కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా గొర్రెలు మేకలను మేపేందుకు అటవీ ప్రాంతంలోకి అనుమతులు ఇవ్వాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అడవిలోకి అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో గొర్రెలు మేకలను తినేందుకు మేత కరువవ్వడమే కాకుండా గోర్లు, మేకల కాపరీ వృత్తిదారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని అవేదన వ్యక్తం చేశారు. వారి ఉపాధిని దృష్టిలో పెట్టుకొని అటవీ అధికారుల వేధింపులు నిలిపివేసేలా చర్యలు చేపట్టి వారికి జీవనోపాధి కల్పించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి వివేక్ వెంకటస్వామి నియోజకవర్గంలో గొర్రెలు, మేకల కాపరుల వృత్తి దాడులపై అటవీ అధికారులు దాడులు నిలిపి వేసి గొర్లు, మేకలను అడవిలో మేతకు అనుమతించేలా చర్యలు చేపట్టాలని జిల్లా అటవీ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో కురుమ సంఘ వన నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని మంత్రి కోరగా జిల్లా కలెక్టర్ తో చర్చించి స్థలం మంజూరుకి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు మంద తిరుమల్ రెడ్డి, వెల్ది సాయి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మైనార్టీ మహిళ యోజన

# పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**మంచిర్యాల, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన పథకం కింద పేద ముస్లిం మహిళలకు మోపెడ్ బైక్/ ఈ -బైక్, 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు అర్హత గల అభ్యర్థుల నుండి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా అల్పసంఖ్యాక సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. రేవంత్ అన్నకా భరోసా మిస్కినో కే లియే పథకం కింద అందిస్తున్న మోపెడ్ బైక్/ ఈ -బైక్ కొరకు అభ్యర్థులు ఫకీర్/ దూదేకుల/ బలహీన ముస్లిం వర్గానికి చెందిన వారై ఉండాలని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు/ఆహార భద్రతా కార్డు చిరునామా రుజువుగా తప్పనిసరిగా జత చేయాలని, 21 -55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని ఒక కుటుంబానికి ఒకసారి మాత్రమే పథకం వర్తిస్తుందని, గత 5 సంవత్సరాలలో టి జి ఎం ఎఫ్ సి నుండి ఆర్థిక సహాయం పొందలేదని అఫిడవిట్ సమర్పించాలని తెలిపారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన పథకం క్రింద 50 వేల రూపాయల కొరకు అభ్యర్థులు మైనారిటీ సమాజానికి చెందిన వారై ఉండాలని, అత్యంత పేద, అవసరమైన మహిళలు, వితంతువులు, విడాకులు పొందిన వారు, అనాధలు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు/ఆహార భద్రతా కార్డు చిరునామా రుజువుగా తప్పనిసరిగా జత చేయాలని, దివ్యాంగులకు జిల్లాలోని మొత్తం లక్ష్యాలలో 5 శాతం రిజర్వేషన్ కేటాయించడం జరుగుతుందని, 21-55 సంవత్సరాల మధ్య వయసు ఉండాలని (వయసు రుజువుకు ఓటర్ గుర్తింపు కార్డు/ ఆధార్ కార్డు), ఒక కుటుంబానికి ఒకసారి మాత్రమే ఆర్థిక సహాయం అందించబడుతుందని, అభ్యర్థుల కనీస విద్యార్హత 5వ తరగతి ఆపైన ఉండాలని, గత 5 సంవత్సరాలలో టి జి ఎం ఎఫ్ సి నుండి ఆర్థిక సహాయం పొందలేదని స్వయంగా డిక్లరేషన్ ఇవ్వాలని తెలిపారు. వివాహితులైతే భర్త ఆధార్, అవివాహితులైతే తల్లితండ్రుల ఆధార్ తప్పనిసరిగా జత చేయాలని, దరఖాస్తుదారు, వారి ఆధార పడిన వారి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో 1 లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాలలో 2 లక్షల రూపాయల లోపు ఉండాలని, రాయితీ ఒకసారిగా మాత్రమే ఆర్థిక సహాయం రూపంలో ఇవ్వబడుతుందని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియలో పారదర్శకత కోసం ఆన్ లైన్‌లో tgobmms.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా అక్టోబర్ 6వ తేదీ వరకు దరఖాస్తు స్వీకరించడం జరుగుతుందని, వివరాలకు 8555841417 నెంబర్ లో సంప్రదించవచ్చని తెలిపారు.

# బాల్య వివాహాలపై అవగాహన

**నిర్మల్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

బాల్య వివాహాల నుండి విముక్తులైన పిల్లలు మరియు వారి తల్లిదండ్రులకు బాల్య వివాహాల పైన అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు జిల్లా బాలల సంక్షేమ సమితి, మహిళా శిశు సంక్షేమశాక విజన్ సంస్థ సంయుక్తంగా నిర్వహించడం జరిగింది. వాళ్ళ వివాహాల వలన పిల్లలకు కలిగే నష్టాలు, శారీరకంగా మానసికంగా తర్వాత ఆర్థికంగా కెరియర్ పరంగా ఏ విధంగా నష్టం జరుగుతుందో తెలపడం జరిగింది. బాల్య వివాహాల వల్ల కుటుంబ భారాన్ని పిల్లల భారాన్ని పోషణ భారాన్ని వ్యక్తిగత ఇబ్బందులను ఏ విధంగా బాలికలు ఎదుర్కొంటారు. అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు శ్రీ.సిమోన్ సుందర్, శ్రీలత, గౌరవ అతిథిగా మురళి బాలల రక్షణ అధికారి, ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన విజన్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శరత్ కుమార్, విజన్ సంస్థ ప్రాజెక్ట్ కమ్యూనిటీ ఆర్గనైజర్లు హారిక, అనురాధ రజిత, జిల్లా బాలల సంక్షేమ సమితి సిబ్బంది చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు పదిమంది బాల్య వివాహాల నుండి విముక్తి అయిన బాలికలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# చిన్నారులకు చిత్రాలేఖనం పోటీలు



**ఇచ్చోడ, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ఇచ్చోడ మండల కేంద్రంలోని గోల్డెన్ లీఫ్ స్కూల్లో ఇచ్చోడ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు కొత్తూరి సునీత ఆధ్వర్యంలో పిల్లలకు చిత్రలేఖల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మరియు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సేవా పక్వాడ కార్యక్రమ ఇంచార్జ్ జాదవ్ సుమన్ గారు రావడం జరిగింది. పోటీలలో విజేతలకు బహుమతులు అందచేశారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు టేహరి రమేష్,బోథ్ నియోజకవర్గం ఇంచార్జ్ కదం బాబారావు పటేల్, జిల్లా నాయకులు భీమ్ రెడ్డి, శేఖర్, మండల నాయకులు పాండురంగ, వినాయక రావు,బోథ్ కాంసెన్సీ సోషల్ మీడియా కన్వీనర్ రాము పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి తాపీ భవనంలో స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం 69 లెవెల్ అండర్-14 ఇయర్ సెలక్షన్ కోసం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను బెల్లంపల్లి మండల విద్యాధికారి పోచయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి శక్తివంతమైన యువత కావాలని, కరాటే, ఆటల పోటీల ద్వారా మాత్రమే యువశక్తి ఉద్భవిస్తుందన్నారు. విద్యార్థుల్లో మానసికో ల్లాసం, దేహదారు దారుఢ్యం ఆటలు క్రీడల తోటే సాధ్యపడతా యన్నారు. అందుకే ఆటలు జీవితానికి భవిష్యత్తుకు బాటలు వేస్తా అన్నారు. చదువుతో పాటు ఆటపాటలపై విద్యార్థుల్లోనూ రాణించాలన్నారు. క్రీడలు విద్యార్థులను క్రమశిక్షణగా తీర్చిదిద్దుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, కాంగ్రెస్ ఎస్సి సెల్ రాష్ట్ర కార్యదర్శి చిన్న రాజం, ఆకనపల్లి హై స్కూల్ హెచ్‌ఎం దామోదర్, మాజీ ఎంఈఓ మహేశ్వర్ రెడ్డి, జీహెచ్‌ఎస్ సెక్రటరీ యాకూబ్, కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు మాస్టర్ వి రవి, బ్రాంచెస్ స్కూల్ హెడ్మాస్టర్ రఘు బాబు, పీడీలు చాంద్ పాషా, బండిరవి, నిర్వాకులు కరాటే మాస్టర్ ఎనగందుల వెంకటేష్, పీఈటీలు రాజు మహ్మద్, శివ మహేష్, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



# పండుగ రద్దీ షురూ

**దసరాకు ప్రత్యేక బస్సులు**
**ఆరు ఆర్టీసీ డిపోల నుంచి 414 సర్వీసులు**
**నేటి నుంచి అక్టోబర్ వరకు నడుపనున్న అధికారులు**



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
దసరా, బతుకమ్మ పండుగ సందర్భంగా హైదరాబాద్‌కు ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ప్రత్యేక బస్సులు నడుపాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన వివరాలను టీజీ ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ మేనేజర్ ఎస్. భవానీ ప్రసాద్ ప్రకటనలో వెల్లడించారు. నేటి నుంచి అక్టోబర్ 1 వరకు సికింద్రాబాద్, హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుస్తాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారు హైదరాబాద్‌లో చదువుకోవడంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నవారు పండుగలకు తమ సొంత గ్రామాలకు రావడానికి రవాణా ఇబ్బందులు లేకుండా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఆరు డిపోలు ఉండగా 414 బస్సులు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

**50 మంది ఉంటే బస్సు సౌకర్యం...**
పాఠశాలలకు నేటి నుంచి దసరా సెలవుల సందర్భంగా 50 మంది ఉన్నచోటికి బస్సులు పంపుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇందుకోసం సంబంధిత డిపో మేనేజర్లను సంప్రదించాలన్నారు. నేటి నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆదిలాబాద్ డిపో నుంచి 85, భైంసా డిపో నుంచి 20, నిర్మల్ డిపో నుంచి 123, ఉట్నూర్ డిపో నుంచి 5, ఆసిఫాబాద్ డిపో నుంచి 58, మంచిర్యాల డిపో నుంచి 123 స్పెషల్ బస్సులను




నడుపుతున్నామన్నారు. ఈ నెల 29 నుంచి అక్టోబర్ 1 వరకు ప్రయాణికుల రద్దీ కారణంగా బస్సులు హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచి కాకుండా సికింద్రాబాద్ జేబీఎస్ నుంచి బయలుదేరుతాయన్నారు. టీజీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్‌లో రిజిర్వేషన్ సౌకర్యం వినియోగించుకోవాలని కోరారు.



## స్టాండర్డ్ డైజేషన్
# లాభాలు ప్రకటించాలి

**మందమర్రి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
కోలిండియాలో సెప్టెంబర్ 22న జెబిసిసిఐ స్టాండర్డ్ డైజేషన్ కమిటీ సమావేశం నిర్వహిస్తుండగా, ఈ సమావేశానికి ముందే సింగరేణి యాజమాన్యం గత ఆర్థిక సంవత్సరం సంస్థకు వచ్చిన లాభాలను ప్రకటించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి, వేజ్ బోర్డు సభ్యుడు మంద నరసింహారావు, ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి అల్లి రాజేందర్, ఎస్సిఈయు(సిఐటియు) బ్రాంచ్ అధ్యక్షుడు సాంబారు వెంకటస్వామిలు డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలో ఈ నెల 22న జరగనున్న స్టాండర్ డైజేషన్ సమావేశంలో పిఎల్ఆర్ బోనస్‌కు సంబంధించిన చర్చ జరగనుండగా, ఈ సమావేశంలో కోల్ ఇండియా, సింగరేణికి సంబంధించిన లాభాలు తెలియజేసిన తరువాతనే బోనస్‌పై చర్చ జరుగుతుందన్నారు. ఇప్పటికే కోల్ ఇండియా యాజమాన్యం లాభాలను ప్రకటించగా, సింగరేణి యాజమాన్యం ఇప్పటివరకు లాభాలను ప్రకటించలేదని వారు మండిపడ్డారు. ఈ సమావేశానికి ముందే సింగరేణి సాధించిన లాభాలను యాజమాన్యం ప్రకటించాల్సిన అవసరం ఉందని, అలా ప్రకటించకుండా సమావేశంలో హాజరు కావడం సరైనది కాద న్నారు. సింగరేణి యాజమాన్యం సమావేశానికి ముందే సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలను తెలుపాలన్నారు.

# వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**మందమర్రి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగులకు ఇచ్చిన హామీలు, సంక్షేమాన్ని వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ జీడి సారంగం, విహెచ్పిఎస్ పట్టణ అధ్యక్షులు రామ్ శ్రీనివాస్ లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మున్సి పల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు కు వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 20 నెలలు గడిచినప్పటికీ వికలాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నిలబెట్టు కోలేదని వారు మండిపడ్డారు. వికలాంగులకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే నెరవేర్చాలని, పింఛన్ 6000 కు పెంచి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నేటి వరకు మొత్తం బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.



# కోల్ కంట్రోలర్ జిఎం సుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివి



**మందమర్రి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
సింగరేణి కొత్తగూడెం కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ జనరల్ మేనేజర్ డివి సుబ్రహ్మణ్యం సింగరేణికి అందించిన సేవలు మరువలేనివని ఆయన సేవలను ఏరియా జీఎం ఎన్.రాధాకృష్ణ కొనియాడారు. ఈనెల 30న పదవీ విరమణ పొందనున్న డివి సుబ్రహ్మణ్యం శనివారం ఏరియాలో పర్యటించగా, జిఎం కార్యాలయంలో ఆయనను ఏరియా జిఎం, జిఎం కార్యాలయ హెచ్వోడీ లు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ మాట్లాడుతూ, ప్రతి ఒక్క ఉద్యోగికి పదవి విరమణ తప్పదన్నారు. పదవి విరమణ అనంతరం ఆయన ఆయురారోగ్యాలతో సంతోషంగా శేష జీవనం కొనసాగించాలని ఆకాంక్షించారు. సింగరేణిలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం విజయ్ ప్రసాద్, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డిజిఎం ఈ అండ్ ఎం బాలాజీ భగవతి జా,కేకే ఓసిపి ప్రాజెక్ట్ అధికారి మల్లయ్య, శాంతిఖని గ్రూప్ ఏజెంట్ ఖాదీర్, ఏరియా రక్షణాధికారి భూశంకరయ్య, వర్క్ షాప్ డిజిఎం దూప్ సింగ్, ఐఈడి ఎస్ఈ కే కిరణ్ కుమార్, డిజిఎం ఎఫ్ అండ్ ఏ ఆర్వీఎస్ఆర్కె ప్రసాద్, పర్చేస్ అధికారి బాబు, క్వాలిటీ అధికారి ప్రదీప్, ఐటి డివై మేనేజర్ రవి, ఏరియా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## అక్రమంగా తరలిస్తున్న
# పిడిఎస్ బియ్యం పట్టివేత

**మందమర్రి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
మండలంలోని రవీంద్రఖని రైల్వేస్టేషన్ నుండి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని శనివారం మండల తహశీల్దార్ పి.సతీష్ కుమార్ స్వాధీనం చేసుకున్నారు. రవీంద్రఖని రైల్వే స్టేషన్ నుండి మహారాష్ట్రకు అక్రమంగా పిడిఎస్ బియ్యం తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి దాడిచేయగా అధికారులను చూసిన బియ్యం అక్రమ రవాణ దారులు అక్కడి నుండి తప్పించుకోగా ఈ దాడుల్లో మూడు క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్
# కూతురికి మెడికల్ సీట్

**కాసిపేట, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం సోమగూడెంకు చెందిన గుజ్జుల సిరికుందన హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ సాధించింది. గుజ్జుల రాజేంద్ర ప్రసాద్-రజిత దంపతుల కుమార్తె సిరికుందన నీట్ పరీక్షలో ప్రతిభను కనబరిచింది. నీట్ ఫలితాల్లో తెలంగాణ స్టేట్ 911 ర్యాంక్ సాధించి ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీట్ సాధించింది. సిరికుందన తండ్రి రాజేంద్ర ప్రసాద్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మెడికల్ సీట్ సాధించిన సిరికుందనను పలువురు అభినందించారు.

# నకిలీ ఆహార పదార్థాల విక్రయాలపై విద్యార్థి సంఘం నిరసన

**నార్నూర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
ఏజెన్సీ ప్రాంతంలో అమాయక గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కల్తీ, నకిలీ పదార్థాలు, సరుకుల విక్రయాలకు నిరసనగా ఆదివాసి విద్యార్థి సంఘం శనివారం మండల కేంద్రంలో నిరసన తెలిపింది. సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ సంతోష్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండల కేంద్రంలోని కుమ్రం భీం చౌరస్తా వద్ద గడువు చెల్లిన, నకిలీ, కల్తీ సరుకులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతం నార్నూర్, గాదిగూడ మండల కేంద్రంతో పాటు లోకారి, తాడిహత్నూర్, మేడిగూడ మార్కెట్లో, వారపు సంతలలో బడా, చిరు వ్యాపారస్తులు దుకాణాలలో గడువు చెల్లిన, కల్తీ, నాసిరకం ఆహార పదార్థాలు, సరుకులు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఆహారభద్రత శాఖ అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టారీతిన విక్రయాలు చేస్తూ నిరక్షరాస్యుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సంబంధిత శాఖ అధికారులు స్పందించి మార్కెట్‌లోని దుకాణాలు, సంతలలో తనిఖీలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘాల



నాయకులు మనోహర్, కనక ప్రభాకర్, మడవి చంద్ర హరి, మడవి యశ్వంత్ రావు, మెస్రం వామన్,మర్ప గంగా రామ్, మెస్రం సంతోష్,కోడప లింగు,మారు, తిరుపతి, శంకర్, దాదిరావ్, శ్యాం రావ్, అజయ్ తదితరులున్నారు.

# క్షయ వ్యాధి నివారణ దిశగా ప్రభుత్వం చర్యలు

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో బ్రౌస్ స్వచ్ఛంద సంస్థ వారి సౌజన్యంతో టి.బి. వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, ప్రోగ్రాం అధికారి సుధాకర్ నాయక్ లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో టి. బి. వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద సంస్థల



సహకారంతో వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. టి. బి. వ్యాధిగ్రస్తుల సంక్షేమంలో భాగంగా బ్రౌస్ స్వచ్ఛంద సంస్థ వారు 350 పోషకాహార కిట్లను అందించడం అభినందనీయమని తెలిపారు. ఈ కిట్ల ద్వారా మందులతో పాటు పోషక ఆహారం, వ్యాధి నిరోధక శక్తి పెరుగుదల, వ్యాధి నుండి కోలుకోవడం జరుగుతుందని, వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా వినియోగించాలని తెలిపారు. వ్యాధిగ్రస్తులు 3 నెలలకు ఒకసారి వైద్యులను సంప్రదించి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని, మందులను క్రమం తప్పకుండా వినియోగించాలని తెలిపారు. జిల్లాలో 797 పాజిటివ్ కేసులు ఉన్నాయని, వ్యాధిగ్రస్తుల వివరాలను నిక్షయ మిత్ర పోర్టల్‌లో నమోదు చేయాలని, తద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం 10 మంది వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. మిగతా కిట్లను ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వ్యాధిగ్రస్తులకు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బ్రౌస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డా. వెంకట శ్రీధర్, సంస్థ ప్రతినిధులు, టి.బి. సమన్వయకర్త సురేందర్ పాల్గొన్నారు.



## పాఠశాల అభివృద్ధికి విరాళం

**సారంగాపూర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

మండలంలోని వైకుంఠపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అబివృద్ధికి మండల బీజేపీ పార్టీ అద్యక్షులు శ్రీకాంత్ (చందు) రూ.20 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడరు.. ఈ నెల 22న నిర్మల్ శాసనసభ్యులు మహేశ్వర్ రెడ్డి పుట్టినరోజు పురస్కరించుకొని ముందస్తుగా ఈ విరాళాన్ని అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గంగన్న మాట్లాడుతూ.. దాతల సహారంతోనే పాఠశాలలు అభివృద్ధి జరుతుందన్నరు విరాలదాతకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రంలో ఉపాధ్యాయులు రాజు, శివశంకర్, బీజేపీ నాయకులు దేవేందర్, ప్రకాశ్,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్



**నిర్మల్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడంతో పాఠశాలలో చదువుతున్న పిల్లలను ఇంటికి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు పిల్లలు బస్టాండ్ రావడంతో జనాలతో బస్టాండ్ కిటికీటలాడింది. 10గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బైంసా ఖానాపూర్ అదిలాబాద్ బోత్ తదితర రూట్లో ఏ బస్సు వచ్చిన సీట్ల కోసం పరిగెత్తుకుంటూ జనాలు ఇబ్బంది పడ్డారు ఆర్టీసీ అధికారులు మాత్రం రద్దీఉన్న ప్రాంతాలను గుర్తించి అప్పటికప్పుడు సర్వీస్‌లను ఏర్పాటు చేశారు

## డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబురాలు



**ఇచ్చోడ, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ డీగ్రీ కళాశాల ఇచ్చోడలో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించడం జరిగింది. దసరా సెలవుల వల్ల చివరి రోజు కావడంతో శనివారం ముందస్తు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సరస్వతి, మధు, అనిత, సరితా, అనిత, తిరుపతి, నర్సయ్య, విజయ్, దయాకర్, బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలో పూల పండుగ

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. విద్యార్థినిలు ఆకర్షణీయమైన దుస్తులను ధరించి రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను పేర్చి సాంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ ఆటపాటలతో విద్యార్థినిలు ఎంతో ఉత్సాహాన్ని కనబరిచారు.



## ఆవిష్కరణల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలి



**మందమర్రి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

నూతన ఆవిష్కరణల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పట్టణ మున్సి పల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు కోరారు. పట్టణం లోని కార్మెల్ పాఠశాలలో శనివారం నిర్వహించిన స్కిల్స్ స్పార్కింగ్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు సెల్ ఫోన్ల వాడకాన్ని తగ్గిస్తూ నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం జేవియర్ రెక్స్ మాట్లాడుతూ పిల్లల లోని సృజనాత్మకతను వెలికితీస్తూ పాఠ్యపుస్తకాల సారాన్ని నిజ జీవితంలో ఎలా అన్వయించుకోవాలో తెలియ చేయడం కోసమే స్పార్కింగ్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నా మన్నారు. అదే విధంగా పాఠశాలలో ముందస్తుగా బతుకమ్మ సంబరాలను నిర్వహిస్తూ విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతూ పండుగ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు.

## ఆర్టీఐ సామాజిక కార్యకర్తల ఫోరం అవగాహన సదస్సు

**ముథోల్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ముథోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన సదస్సులో ఆర్టీఐ సామాజిక కార్యకర్తల పోరం తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సయ్యద్ కలీం మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు ప్రతి భారతీయుడు సమాచార హక్కు చట్టాన్ని వినియోగించి అవినీతి అక్రమాలను అరికట్టడమే కాకుండా సామాజిక మార్పుకు యువత నాంది పలకాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మహాలక్ష్మి జమీఅత్ ఉల్ ఉలేమా ముథోల్ అధ్యక్షులు హాఫీజ్ అబ్దుల్ ఖవీ జనరల్ సెక్రెటరీ ముక్తి రయీస్ ఖాస్మి ముథోల్ మండల మాజీ వైస్ ఎంపీపీ ఎజాజ్ ఉద్దీన్ మొహమ్మద్ సలీం, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.





## బాసరలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

### నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల

**ముథోల్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

బాసర శ్రీ జ్ఞానసరస్వతి ఆలయంలో రేపటి నుండి ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని పోలీసు అధికారులు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఉత్సవాల కాలంలో భక్తులు అధిక సంఖ్యలో రానున్న కారణంగా ట్రాఫిక్ రద్దీ లేకుండా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించారు. బాసర ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు, షీ టీమ్స్, క్యూఆర్‌టి టీమ్స్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ తదితరులను క్రమబద్ధంగా నియమించారు. మహిళా భక్తుల భద్రత కోసం ప్రత్యేక బృందం అయిన శివంగి దళాలు పనిచేస్తాయని తెలియజేశారు. భక్తులు శాంతి, భద్రత వాతావరణంలో అమ్మవారి దర్శనం చేసుకునేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే భక్తులు పోలీస్ శాఖ సూచనలు పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మెడికల్ సీటు సాధించిన రైతు బిడ్డ

**కుభీర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కుభీర్ మండలం పల్సి గ్రామానికి చెందిన కుప్రే నర్సవ్వ, హన్మాండ్లు కూతురు అపర్ణ అనే విద్యార్థిని నీట్ పరీక్షలో మంచి 504 ర్యాంక్ సాధించి వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటును పొందింది. గ్రామం నుంచి ఎంబీబీఎస్‌కు ఎంపికైనమొట్ట మొదటి విద్యార్థిని అపర్ణ కావడం విశేషం. ఆమె తల్లి దండ్రులు వ్యవసాయంపై ఆదారపడి జీవిస్తున్న కుటుంబం. ఈ సంద్భంగా గ్రామం నుంచి మెడికల్ సీటు సాధించిన మొదటి విద్యార్థిని అపర్ణను ఉపాధ్యాయులు, గ్రామస్థులు శనివారం ఘనంగా సన్మానించారు. నాలుగో తరగతి వరకు పల్సి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, ఐదు నుంచి ఇంటర్ వరకు ఇచ్చోడలోని ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలలో చదివిన ఆమెను మెడికల్ సీట్ సాధించడం అభినందనీయమని, గ్రామంలోని మిగతా విద్యార్థులకు ఆదర్శమని కొనియాడారు. ఈ సంద్భంగా ఆమెను శాలువాలతో సత్కరించి అభినందించారు.





## సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో

# ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు




**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణుల ద్వారా ఆరోగ్యకరమైన, శక్తివంతమైన కుటుంబము అనే వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా సురేఖ ప్రేమ్ సాగర్ రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్ రావు మాట్లాడుతూ ఆరోగ్య కరమైన శక్తివంతమైన కుటుంబము కార్యక్రమాలు జిల్లాలో సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు 96 కేంద్రాలలో చెపడుతున్నట్లు తెలిపారు. కిమ్స్ హైదరాబాద్ ఆసుపత్రి నుండి క్యాన్సర్ నిపుణులు డాక్టర్ ధీరజ్ ఆధ్వర్యంలో పరీక్షలు, చికిత్సలు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అదే విధంగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యజ్ఞన శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది ఐఎంఏ మంచిర్యాల్ తరపున పాల్గొన్న 17 మంది ప్రైవేట్ వైద్య నిపుణులు, జిల్లాలోని వైద్య కళాశాల నుండి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుండి వచ్చిన స్పెషలిస్ట్ వైద్యులు డిస్టిక్ కోఆర్డినేటర్ హాస్పిటల్స్ నుండి వచ్చిన వైద్య నిపుణులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి వచ్చిన వైద్య సిబ్బంది వైద్యులు, జాతీయ పోషణ దినోత్సవాన్ని అంగన్వాడీ కార్యకర్తలు సిడిపివోలు సుప్రవైజర్లు ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా అవగాహన కలిగించిన కళాకారులు హైదరాబాద్‌లో సాఫ్ట్వేర్‌గా పని చేస్తున్న బ్రౌన్ అనే ఎన్జీవో ద్వారా జిల్లాలోని క్షయ వ్యాధిగ్రస్తులకు 375 పోషకార కిట్లను ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. సుమారు 300 మంది మహిళలు రిజిస్ట్రేషన్ చేసుకుని వైద్య సేవలను పొందడం జరిగిందన్నారు.

# విద్యా వ్యవస్థలో సమూల మార్పులు జరగాలి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
విద్యార్థి దశ ఎంతో విలువైనదని, ఈ సమయాన్ని వృధా చేయకుండా సరైన రీతిలో వినియోగించుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. శనివారం ఆదిలాబాద్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల-1లో పీఎం శ్రీ పథకం కింద 2 అదనపు తరగతుల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యారంగం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూనే విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వంకు విన్నవించారు. విద్య వ్యవస్థలు చాలా మార్పులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. గతంలో కేవలం 35 మార్కులు వచ్చి పాస్ అయితే సరిపోయేదని, కానీ ప్రస్తుతం కాంపిటీషన్ సమాజంలో ఉత్తమ ర్యాంక్ లు వస్తేనే విద్యార్థికి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రాథమిక, ఉన్నత విద్య లో సరైన ప్రామాణికతను అందించాలని, అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు. భారతదేశంలోని పురాతన విద్యా వ్యవస్థ పై వివిధ దేశాలు అధ్యయనం చేస్తున్నాయని, అందుకు చదువుల తల్లి సరస్వతీ దేవిని ఫోటోలు పెట్టి పూజించడమే దీనికి నిదర్శనమని ఆయన అన్నారు.

ఎమ్మెల్యే పాయల్ శంకర్


# ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలి



**మందమర్రి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటి పథకంలో ఎంపికైన లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాన్ని పూర్తిచేసి, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రామచందర్ కోరారు. మండలంలోని చిర్రకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు పథకం లబ్ధిదారులు దుర్గం తార ఇంటి నిర్మాణంలో స్లాబ్ పూర్తయిన సందర్భంగా హౌసింగ్ శాఖ ఏఈ జోష్నా ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి, మూడవ బిల్లు మంజూరుకు శనివారం ప్రతిపాదనలు పంపారు. ఈ సందర్భంగా రామచందర్ మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వ 10 సంవత్సరాల కాలంలో ఒక నిరుపేదకు ఇల్లు నిర్మించి ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి పాటుపడుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

## కరాటే పోటీలకు ఎంపికైన అండర్-14 విద్యార్థులు



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో శనివారం 69వ జిల్లా స్థాయి అండర్ 14 ఇయర్ పోటీల్లో విద్యార్థుల జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ సెలక్షన్ పోటీల్లో 120మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ కేటగిరీలో ఎంపికైన బాలికలు ఇషిత, దీక్షిత, శ్రీ వర్షిత, వి. సహస్ర, ఆరుషి, సాధన, మన్విత లక్ష్మీ రాజ్, ఆనందన, వైశాలి ఉన్నారు. బాలురులో ప్రైస్, సృజన్, సాయి తేజ, శ్రీహన్స్, సహస్రర్షిత, అశ్విత్, వర్షిత్, నిదర్శన్, అశ్వితేజ ఉన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి గ్రామస్థుల సన్మానం

**కుభీర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
విద్యా బోధనలో ప్రశంసలు అందుకున్న నిర్మల్ జిల్లా కుభీర్ మండలం అంతర్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కత్తి నాగోరావ్‌ను శనివారం గ్రామస్థులు సన్మానించారు. ప్రభుత్వ పాలన దినోత్సవం సందర్భంగా ఈనెల 17న జిల్లా కేంద్రంలో జరిగిన జెండా ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాగోరావును జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించి సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నాగోరావును సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సునీత, హెచ్ఎం సుభాష్, ఆనంద్, సాయినాథ్, లక్ష్మణ్, దర్శనం దత్తు, భోజన్న, యోగేశ్వర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# కాటమయ్య కిట్లు పంపిణీ చేయాలి



**తాండూర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
గౌడ కులస్తుల జీవనం రోజు రోజుకు అధ్వాన్నంగా మారుతుందని మోకుదెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి భూసరపు మొండిగౌడ్ అన్నారు. ప్రభుత్వం గీతా కార్మికులకు ఇస్తామన్న కాటమయ్య కిట్లు అందక పోవడం వల్ల తరచూ గీత కార్మికులు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. గౌడ సంఘం నాయకులతో కలిసి తాండూర్ ఐబీలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం బెల్లంపల్లి మండలంలోని మాలాగురిజాల గ్రామంలో పోతుగంటి శంకర్ గౌడ్ అనే గీతా కార్మికుడు చెట్టు ఎక్కి కిందకు దిగే క్రమంలో కాలుజారి బురదలో పడి మృతి చెందాడని వివరించారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన గీత కార్మికులకు వెంటనే కాటమయ్య కిట్లు పంపిణీ చేయాలని, చనిపోయిన శంకర్ గౌడ్ కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మోకుదెబ్బ రాష్ట్ర నాయకులు శంకర్, జిల్లా అధికార ప్రతినిధి భాస్కర్ గౌడ్, జిల్లా కార్యదర్శి రమేష్, గౌడ్, సృజన్ గౌడ్ ఉన్నారు.

# ముందస్తు బతుకమ్మ సంబరాలు

**మందమర్రి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో భాగమైన ముందస్తు బతుకమ్మ పండుగ సంబరాలు శనివారం పట్టణంలోని ఫిల్టర్ బెడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల మహిళ ఉపాధ్యాయులు, విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, పసుపు కుంకుమలతో భక్తిశ్రద్ధలతో గౌరమ్మను పూజించి, ఆటపాటలతో బతుకమ్మను కొలిచారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు, విద్యార్థులు అందరూ బతుకమ్మ ఆటపాటలతో హోరెత్తించారు. బతుకమ్మ పాటలకు తగ్గట్టుగా నృత్యాలు చేస్తూ కార్యక్రమాన్ని ఆద్యంతం ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రపంచంలోనే పువ్వుల పేరుతో



పండుగ నిర్వహించుకునే ఏకైక పండుగ రాష్ట్రంలో బతుకమ్మ పండుగ అని తెలిపారు. విద్యార్థులకు మన సంస్కృతి సాంప్రదాయాలు తెలిపేందుకే బతుకమ్మ పండుగ వేడుకలు నిర్వహించడం జరిగిందన్నారు. పండుగ సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## మహిళ మోర్చ ఆధ్వర్యంలో సేవ పక్వాడ

**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
మండలంలోని హర్కపూర్ తండా గ్రామంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సేవా పక్వాడ కార్యక్రమంలో మహిళ మోర్చ మండల అధ్యక్షురాలు రాథోడ్ రాధిక ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలో ఆపరేషన్ సింధూరు గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం డ్రాయింగ్ పోటీలను నిర్వహించి, బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కనక తుకారాం, ఇంద్రవెల్లి బూత్ అధ్యక్షుడు సింధే దత్త, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చవాన్ మనోజ్, బీజేపీ నాయకుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచేది జర్నలిస్టులు

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచేది జర్నలిస్టు లు అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక ప్రెస్ క్లబ్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... నిజాలను తెలుసుకుని ప్రజలకు జవాబుదారీగా మీడియా వ్యవహరించాలని సూచించారు. ఒకప్పటి మీడియాకు ఇప్పటి మీడియాలో ఎన్నో మార్పులు జరిగాయని పలు ఉదాహరణలతో వివరించారు. ముఖ్యంగా తొందరపాటుతో తప్పడు సమాచారం వలన సమాజాన్ని పక్క దారి పట్టించిన వారు కావద్దని హితవు పలికారు. భారత రాజ్యాంగం ఫోర్త్ ఎస్టేట్‌కు ఎంతో ప్రాధాన్యత కల్పించిందన్నారు. జిల్లాలో కొందరు జర్నలిస్ట్ లు మీడియా ద్వారా బయట ప్రపంచానికి చూపుతున్న కథనాలపై స్పందిస్తున్నామని వెల్లడించారు. ప్రజలను ఎప్పటికప్పుడు మీడియా అప్రమత్తం చేయాలని కోరారు. అంతకుముందు పలువురు నాయకులు మాట్లాడుతూ లక్షెట్టిపేటలో ప్రెస్ క్లబ్ భవన్ అనేది ఎన్నో కష్టాలు ఎదుర్కొని జర్నలిస్టులు సాధించారని కొనియాడారు. జర్నలిస్టులు బాధ్యతయుతంగా పని చేయాలని సూచించారు. ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను ఘనంగా శాలువాతో సన్మానించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బోనగిరి కుమార్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# పచ్చని కుటుంబంలో మద్యం చిచ్చు.. భార్యను హతమార్చిన భర్త

**రెబ్బెన, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
పచ్చని కుటుంబంలో మద్యం చిచ్చు రేపింది. ఓ నిండు ప్రాణం తీసేలా ప్రేరేపించింది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని నారాయణ పూర్ గ్రామానికి చెందిన గజ్జుల తిరుపతి మద్యానికి బానిసైన తరుచూ భార్యతో గొడవ పడేవాడు. ఇదేకోపంలో శనివారం ఉదయం భార్య శ్రావంతిని ఇంట్లోనే గొడ్డలితో అతి కీరాతకంగా వారికీ హత్య చేశాడు. నిందితుడ్ని పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. అంతకుముందు సంఘటన స్థలాన్ని ఏఎస్పీ చిత్తరంజన్ సందర్శించి హత్యకు గల కారణాలపై ఆరాతీశారు. ఆయన వెంట సీఐ సంజయ్. ఎస్ఐ వెంకటకృష్ణ ఉన్నారు.





## ఫొటో ట్రేడ్ ఎక్స్ పో-2025లో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
హైదరాబాద్‌లోని ఓం కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ప్రారంభమైన ఫోటో ట్రేడ్ ఎక్స్ పో-2025లో సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఫోటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఫోటోగ్రఫీ గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని, కౌశల్ వికాస్ యోజన కింద శిక్షణ పొందాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సినీ డైరెక్టర్ తేజ, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## కార్మికులకు లాభాలలో 35 శాతం వాటా చెల్లించాలి

### టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాసరావు



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
కార్మికులకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన వాస్తవ లాభాలలో 35% సింగరేణి ఉద్యోగులకు చెల్లించాలని టీబిజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియా ఖైరగూడ ఓపెన్ కాస్ట్‌లోని కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరాకు కేవలం 15 రోజుల సమయం ఉన్నదని ఇప్పటి వరకు లాభాలు ఎంతో లాభాల వాటా ఎంతో ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికులు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారని వెంటనే లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ సింగరేణి కార్మికులకు అందించిన తండ్రుల ఉద్యోగం కొడుకులకు అయినటువంటి మెడికల్ బోర్డును గత ఆరు నెలల నుండి నిర్వహించడం లేదని వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్, అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి నాయకత్వంలో కోల్ బెల్ట్ ప్రాంత ప్రజా ప్రతినిధుల సహకారంతో హైదరాబాద్ స్థాయిలో కూడా పోరాటం చేయడానికి వెనకాడమన్నారు. ఫిట్ కార్యదర్శి వెంకటేష్, ఏరియా కార్యదర్శి వెంకటేష్, సెంట్రల్ కమిటీ జాయింట్ సెక్రెటరీ కిరణ్, నాయకులు జూనియర్ తిరుపతి, దస్తగిరి రమేష్, రాజమౌళి, రాజేశం, బిక్షపతి, అజీమ్, రవీందర్, రవి, కిరణ్, క్రైతస్వామి,బోరిగం శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పశువులను తరలిస్తున్న వ్యక్తిపై కేసు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
ఆక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసి నట్లు వన్ టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన షేక్ ఇమామ్ ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తిప్ప నుంచి సుభాష్‌నగర్‌కు వాహనంలో మూడు ఆవులు, ఒక లేగదూడను తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో వాహనాన్ని పట్టుకుని మూగ జీవాలను గుడిహత్నూర్‌లోని గోశాలకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

# యూరియా పంపిణీలో ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది

### మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
రైతులకు అందాల్సిన యూరియాపై స్థానిక బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్రంపై ఒత్తిడి పెంచకుండా కాంగ్రెస్ ముఖ్యమంత్రిని పొగడ్తలతో ముంచెత్తడం పరిపాటిగా మారిందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బేల మండలం దోప్టాల పంచాయతీ పరిధిలోని రంకం గ్రామానికి చెందిన కోడిమెత మాధవరావు అనే రైతుని స్థానిక పోలీసులు ఇబ్బందులకు గురి చేయడంపై మాజీ మంత్రి జోగు రామన్న స్పందిస్తూ శనివారం కోడిమెత మాధవ రావుతో పాటు రైతులను కలిసి పరామర్శించారు. యూరియా పంపిణీలో మాధవ రావుపై జరిగిన దౌర్జన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతులు అధైర్య పడవద్దు అని ధైర్యం కల్పించారు. యూరియా పంపిణీలో రైతులకు జరుగుతున్న అన్యాయంపై స్థానికులు జోగు రామన్నతో ఆవేదన వెళ్లగక్కారు. జోగు రామన్న మాట్లాడుతూ యూరియా పంపిణీలో పోలీసులు టోకన్లు పంపిణీ చేయడం పై మండిపడ్డారు. వ్యవసాయ అధికారులతో పాటు పోలీసులు రైతు కుటుంబం నుండే వచ్చి నిధులు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. రైతుల పట్ల మర్యాదగా నడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యూరియా పంపిణీలో పోలీసుల వ్యవహారంపై జిల్లా ఎస్పీకి వివరిస్తామన్నారు. రైతుల పక్షాన మరోసారి బీ.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలతో పాటు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సకాలంలో రైతులకు సరిపడా యూరియా అందజేయకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన



కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, ప్రమోద్ రెడ్డి, సతీష్, తేజో రావు, విశాల్, విపిన్, విట్టల్, జితేందర్, దేవదాస్, రాజు, పాల్గొన్నారు.

# రక్తదానం చేయండి.. ప్రాణదాతలు అవ్వండి

### డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని అని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ అన్నారు. శనివారం స్థానిక ఎస్పిఆర్ ఫంక్షన్ హాల్లో మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని లక్షెట్టిపేట్, దండేపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్ రావు ప్రారంభించి రక్తదాతలకు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ జిల్లా అధ్యక్షురాలు సురేఖమ్మ మాట్లాడుతూ... ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని అన్నారు. రక్తదానంతో ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్ చంద్, ఆర్టిఏ నెంబర్ అంకతి శ్రీనివాస్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం, నలిమెల రాజు, మోహన్, అశోక్, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మీడియాపై ఆంక్షల పోస్టర్ల తొలగింపు

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
జిల్లా ఆస్పత్రిలోకి మీడియాకు అనుమతిపై ఆసుపత్రి సూపరింటెంట్ ఆంక్షలు విధిస్తూ ఆసుపత్రి గోడలపై వేసిన పోస్టర్లను శనివారం సాయంత్రం తొలగించారు. గత నాలుగు రోజుల క్రితం మీడియాపై ఆంక్షలు విధిస్తూ జిల్లా ఆసుపత్రి గోడలపై పోస్టర్లు వేయగా జర్నలిస్టు సంఘాలు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించడానికి నిర్ణయించాయి. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా సోమవారం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేయడానికి జర్నలిస్ట్ సంఘాలు నిర్ణయించాయి. దీంతో దిగొచ్చిన ఆసుపత్రి సిబ్బంది గోడలపై అంటించిన పోస్టర్లను తొలగించారు. ప్రజాస్వామ్యంలో మీడియాపై ఆంక్షలు విధించడం సరైనది కాదని జర్నలిస్టు సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్న వేళ వారి నిరసనకు ఫలితం వచ్చినట్లయ్యింది. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రి సూపర్డెంట్ ప్రవీణ్ మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలోకి మీడియాకు అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో గత వారంలో జరిగిన కొన్ని సంఘటనలతో ఆసుపత్రి గోడకు పోస్టర్లు అంటించడం జరిగిందని వాటిని తొలగిస్తున్నట్లు తెలిపారు. గతంతో పోలిస్తే ఆసుపత్రిలో సేవలు మెరుగయ్యాయని, అయితే ఇతర ఆస్పత్రులతో



పోలిస్తే కొంత మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. అయినప్పటికీ జిల్లా ఆస్పత్రిలో ప్రతిరోజు 700 పైగా ఓపి కొనసాగుతుందన్నారు. ఉన్న సిబ్బందికి పని ఒత్తిడి ఎక్కువ కావడంతో మీడియా వారికి సరైన సమాచారం ఇవ్వలేకపోతున్నామని, ఇప్పటినుండి అలా కాకుండా ప్రత్యేకంగా ఒక అధికారిని సమాచారం ఇవ్వడానికి కేటాయిస్తున్నట్లు తెలిపారు. మీడియా వారికి కావలసిన సమాచారం సదరు అధికారి దగ్గర నుండి తీసుకోవచ్చని వివరించారు. జిల్లా ఆస్పత్రికి మరింతమంది రోగులు వచ్చే విధంగా మీడియా సహకరించాలని కోరారు.

# తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్.. ముగ్గురి అరెస్టు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
ప్లాటును తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్న ముగ్గురిని శనివారం అరెస్టు చేసినట్లు మావల సీఐ కర్రెస్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. విజయ్ పాల్కుర్వార్ 2011లో ఎంప్లాయిస్ కాలనీలో ప్లాటు కొనుగోలు చేశారు. ఆ ప్లాటు పెయింటర్ సంజీవ్ సహకారంతో వెంకటరమణ గతేడాది అప్పటి సబ్ రిజిస్ట్రార్ రఘుపతి పేరిట మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించారు. ముందుగా ప్లాటు కొనుగోలు చేసిన విజయ్ పాల్కుర్వార్ను బెదిరించి కబ్జా చేశారు. బాధితుడి ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అప్పటి సబ్ రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేశామన్నారు.



## రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

**బెజ్జూర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
బెజ్జూర్ మండలంలోని సోమీని నుంచి గేర్రగూడ వరకు దారి అంతా బురదమయంగా మారిందని గిరిజన గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రతినిత్యం గ్రామానికి వెళ్లాలంటే వాహనాలు, అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సైతం వెళ్ళలేని పరిస్థితిగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారిన, పాలకులు మారిన గిరిజన గ్రామాల ప్రజల తలరాతలు మాత్రం మారడం లేదని ప్రజలు వాపోతున్నారు. భారీ వర్షం కురిసినట్లయితే సుస్మీర్ ఒర్రె లు ఓ పొంగితే రాకపోకలు స్తంభిస్తాయని ప్రజలు తెలుపుతున్నారు. అటవి శాఖ అనుమతులు రాక రోడ్లు,వంతెనలు మంజూరు కాకపోవడంతో గిరిజన గ్రామాల బస్సులు తదితర వాహనాలు సైతం రాక నాన్న తండాలు పడాల్సిన పరిస్థితిగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పాలకులు స్పందించి గిరిజన గ్రామాలకు రోడ్లు వంతెనలు మంజూరు చేసి ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపరచాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## డంపింగ్ యార్డ్‌ను తరలించండి

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రక్కనే ఉన్న డంపింగ్ యార్డ్ ను వేరే చోటికి తరలించాలని శనివారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌కు వినతి పత్రాన్ని అంద చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో సేకరించిన చెత్త, జంతు కళేబరాలను ఆదర్శ పాఠశాల ప్రహరీ గోడ ప్రక్కనే పడివేయడంతో విద్యార్థులు దుర్వాసనతో చాలా ఇబ్బందులు పడుతున్నారని, హాస్టల్‌లో ఉండే విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. అలాగే ఆ ప్రక్కనే ఉన్న మైసమ్మ ఆలయంకు వెళ్ళే దారిలోనే చెత్త, జంతు కళేబరాలు వేయడంతో ఆలయానికి వెళ్ళే భక్తులు చాలా ఇబ్బందులు ఎదురుకుంటున్నారని అన్నారు.వెంటనే మున్సిపల్ అధికారులు చొరవతీసుకొని డంపింగ్ యార్డ్‌ను వేరే చోటికి తరలించాలని డిమాండ్ చేశారు.





## సైకిల్ చైన్లు రెడీ చేసుకోండమ్మా.. 'శివ' 4K రీ- రిలీజ్

తెలుగు సినిమా చరిత్రలో ట్రెండ్ సెట్టర్ గా నిలిచిన 'శివ' సినిమా మళ్లీ ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడానికి సిద్ధమవుతోంది. 1989లో నాగార్జు , రామ్ గోపాల్ వర్మ కాంబినేషన్‌లో విడుదలైన ఈ కల్ట్ క్లాసిక్ ఇప్పుడు సరికొత్త అవతారంలో 4K డాల్బీ అట్మాస్ టెక్నాలజీతో రీరిలీజ్ కాబోతుంది. ఈ రోజు అక్కినేని నాగేశ్వరరావు గారి 101వ జయంతి సందర్భంగా, ఆయన తనయుడు నాగార్జున ఈ విశేషాన్ని అధికారికంగా ప్రకటించారు. నవంబర్ 14న ఈ సినిమా మళ్లీ థియేటర్లలో సందడి చేయబోతోంది. నాగార్జున మాట్లాడుతూ, "నా నాన్నగారు సినిమాలు తరతరాల పాటు జీవించాలి అనే విశ్వాసంతో ఉండేవారు. అందుకు 'శివ' సినిమా ఒకగొప్ప ఉదాహరణ. ఇప్పుడు ఈ సినిమాను అత్యాధునిక టెక్నాలజీతో మళ్లీ తెరపైకి తీసుకురావడం ఆయన కలకు నివాళిగా భావిస్తున్నాను" అని తెలిపారు. ఇప్పటి వరకూ ఏ రీరిలీజ్ సాధించని విధంగా, 'శివ' చిత్రానికి ప్రత్యేకమైన సౌండ్ ప్రాసెసింగ్ చేశారు. ప్రాచీన మోనో ఆడియోను ఆధునిక AI టెక్నాలజీ ద్వారా డాల్బీ అట్మాస్‌కి మార్చడం ద్వారా, ప్రేక్షకులకు పూర్తిగా కొత్త అనుభూతిని ఇవ్వాలని చిత్రబృందం భావిస్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ, "ఇంతకుముందు ఎప్పుడూ వినని టువంటి సౌండ్ ఎక్స్పీరియన్స్ ఇప్పుడు ప్రేక్షకులకు లభించబోతోంది. ఆ మాయాజాలాన్ని మీరంతా థియేటర్లలో ఆస్వాదించాల్సిందే" అన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై అక్కినేని వెంకట్, సురేంద్ర యర్లగడ్డ ఈ సినిమాను నిర్మించారు. అప్పట్లో ఈ సినిమా కథ, టేకింగ్, టెక్నికల్ వాల్యూస్ అన్నీ భారత సినిమా స్థాయిని మారుస్తూ "Before Shiva After Shiva" అనే విధంగా పేరు పొందింది. ఈ రీ రిలీజ్‌తో ఆ ఘనతను మరోసారి గుర్తు చేస్తూ, కొత్త తరం ప్రేక్షకులకు 'శివ' మళ్లీ ఓ అద్భుత అనుభవాన్ని అందించనుంది.

దిశా పటానీ.. నటనతోనే కాదు గ్లామర్ తో కూడా కట్టిపడేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. పూరీ జగన్నాథ్ హీరోగా మెగా ప్రిన్స్ హీరో వరుణ్ తేజ్ హీరోగా వచ్చిన లోఫర్ సినిమాతో తెలుగు ప్రేక్షకులను తొలిసారి పలకరించింది. మొదటి సినిమాతోనే తన అమాయకత్వంతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ చిన్నది. ఇందులో తన నటనతో అబ్బురపరిచిన ఈమె.. ఆ తర్వాత హిందీలో పలు ప్రాజెక్టులలో అవకాశాలు అందుకొని అక్కడ సత్తా చాటుతూ దూసుకుపోతోంది. ఇదిలా ఉండగా ఈ మధ్యకాలంలో 'స్త్రీ 2' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి ఊహించని కలెక్షన్స్ ను సొంతం చేసుకుంది. అంతేకాదు ఈ సినిమా కలెక్షన్స్ తో అటు బాలీవుడ్ పరిశ్రమ కూడా ఊపిరి పీల్చుకుంది అనడంలో సందేహం లేదు లేడీ ఓరియెంటెడ్ మూవీగా వచ్చి సంచలనం సృష్టించి.. తన ఖాతాలో ఒక బ్లాక్ బాస్టర్ విజయాన్ని వేసుకున్న దిశాపటానీ ఇప్పుడు 'స్త్రీ 3' అనే మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. అలా ఒకవైపు తన సినిమా షూటింగ్లో బిజీగా ఉంటూనే.. మరొకవైపు ఇలా అభిమానులను ఆకట్టుకుంటూ మరింత వైరల్ గా మారింది అని చెప్పవచ్చు. తాజాగా అభిమానులను ఆకట్టుకోవడానికి వైట్ కలర్ ఫ్రాక్ ధరించి అందాలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. ముఖ్యంగా ఎద అందాలను చూపిస్తూ.. కొంటె చూపులతో కుర్రకారును మాయ చేస్తోంది. అంతేకాదు ఈ ఫోటోలకు ఆమె ఇచ్చిన ఫోజులు కూడా అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి అనడంలో సందేహం లేదు. అంతలా తన గ్లామర్ తో కట్టిపడేస్తోంది దిశా పటానీ. దిశాపటానీ ఫోటోలు చూసిన అభిమానులు, ఫాలోవర్స్, నెటిజన్స్ పలు రకాల కామెంట్లు చేస్తున్నారు. కొంతమంది నెట్ ఫాలోవర్స్ లవ్ ఎమోజీలను షేర్ చేస్తే.. మరి కొంత మంది ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తున్నారు. ఇంకొంతమంది రేడియంట్ గ్లాస్ స్కిన్ అంటూ ఆమె మేని ఛాయను పొగుడుతూ కామెంట్లు పెడుతున్నారు. ఇలా ఎవరికి వారు దిశా పటాని గ్లామర్ పై కామెంట్లు చేయడం ఇప్పుడు వైరల్ గా మారింది. 1992 జూన్ 13న ఉత్తరప్రదేశ్లోని బరేలిలో జన్మించింది. ఈమె తండ్రి జగదీష్ సింగ్.. ఈయన ఒక పోలీసు అధికారి. ఈమె తల్లి హెల్త్ ఇన్స్పెక్టర్.. అక్క కుష్బూ పటానీ. భారత సైన్యంలో మేజర్ గా పని చేస్తున్నారు. అలాగే ఫిట్నెస్ కోచింగ్, ఎంటర్ప్రెన్యూర్ కూడా. అంతేకాదు ఈమెకు సూర్యాన్ష్ పటానీ అనే తమ్ముడు కూడా ఉన్నారు. లక్నోలోని అమిటీ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం పూర్తి చేసింది. అంతేకాదు పాండ్స్ ఫెమినా మిస్ ఇండియా ఇండోర్ 2013లో మొదటి రన్నరప్ గా కూడా నిలిచింది. ఈమె ప్రత్యేకతల విషయానికి వస్తే.. గూగుల్ లో 2016లో అత్యధికంగా సెర్చ్ చేసిన ప్రముఖుల జాబితాలో ఈమె ఐదవ స్థానాన్ని దక్కించుకున్నారు. 2019లో ఫోర్బ్స్ ఇండియా సెలబ్రిటీ 100 జాబితాలో చోటు సంపాదించుకున్న ఈమె ఏడాదికి 58 మిలియన్ డాలర్లు సంపాదిస్తున్న నటిగా 43వ స్థానంలో నిలిచింది. అంతేకాదు టైమ్స్ 50 మోస్ట్ డిజైరబుల్ ఉమెన్ జాబితాలో కూడా తరచూ చోటు సంపాదించుకుంటుంది.



## గ్లామర్ తో కట్టిపడేస్తున్న దిశాపటాని..




## 'లిటిల్ హార్ట్స్' నార్త్ అమెరికా బాక్సాఫీస్ లెక్కలివే..

ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'లిటిల్ హార్ట్స్ ' తెలుగు చిత్ర పరిశ్రమలో ఆశ్చర్యకర విజయాన్ని అందుకుంది. మౌళి తనుజ్ ప్రశాంత్, శివాని నాగరం జంటగా నటించిన ఈ సినిమాకు సాయి మార్తాండ్ దర్శకత్వం వహించగా, #90's ఫేమ్ ఆదిత్య హాసన్ నిర్మాణ బాధ్యతలు నిర్వహించారు. మొదట ఈ సినిమాను ఓటీటీ ద్వారా విడుదల చేయాలనే ఆలోచన ఉన్నా, థియేటర్లలో విడుదల చేయడం చిత్రబృందానికి కలిసొచ్చింది. సాధారణంగా డెబ్యూ హీరో, డెబ్యూ డైరెక్టర్ సినిమాలు ఇంత పెద్ద రేంజ్‌లో సక్సెస్ కావడం అరుదు. కానీ 'లిటిల్ హార్ట్స్ ' మాత్రం అందుకు భిన్నంగా నిలిచి, నార్త్ అమెరికాలో 1 మిలియన్ డాలర్ల మార్క్‌ను దాటి భారీ మైలురాయిని నమోదు చేసింది. ఇది చిన్న బడ్జెట్ సినిమాకు గర్వించదగిన విషయం. తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా ఈ సినిమాకు ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా థియేటర్లలో రొమాంటిక్ కామెడీ జానర్‌కి ఉన్న క్రేజ్ ఈ సినిమా విజయం ద్వారా మరోసారి రుజువైంది. "మిరాయ్", "కిష్కింధపురి" వంటి సినిమాల పోటీ మధ్య వచ్చినా, 'లిటిల్ హార్ట్స్ ' తనదైన గుర్తింపు తెచ్చుకుంది. ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, జయకృష్ణ, అనిత చౌదరి, ఎస్.ఎస్. కంచి, సత్య కృష్ణన్ వంటి పలువురు ప్రముఖులు ముఖ్య పాత్రల్లో కనిపించగా, సంగీతాన్ని సింజిత్ యెర్రమిల్లి అందించారు. వంశీ నందిపాటి, బన్నీ వాసు డిస్ట్రిబ్యూషన్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఈ సినిమా రూ.40 కోట్ల గ్రాస్ మార్క్‌కు చేరువవుతోంది. ప్రేక్షకుల రెస్పాన్స్‌ను దృష్టిలో ఉంచుకుని, చిత్ర బృందం ఈ సినిమాను త్వరగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో రిలీజ్ చేయబోమని స్పష్టంగా తెలిపింది. 'లిటిల్ హార్ట్స్ ' చిన్న బడ్జెట్ సినిమాగా వచ్చి భారీ విజయాన్ని సాధించి, ఇండస్ట్రీకి ఓ మంచి బూస్ట్ ఇచ్చిందనే చెప్పాలి. మంచి కథ, సింపుల్ కథనంతో కూడిన ఎంటర్టైనర్‌లు ఎప్పుడూ విజయాన్ని అందుకుంటాయని 'లిటిల్ హార్ట్స్ ' ప్రూవ్ చేసింది.



## కొత్త యాంగిల్‌లో సన్నీ లియోన్..

హాట్ బ్యూటీ సన్నీ లియోన్.. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకూ ఈ పేరు తెలియని వాళ్లుండరు ఇప్పటికే పలు సినిమాలతో క్రేజ్ తెచ్చుకున్న ఈ బ్యూటీ. ముఖ్యంగా తెలుగులో కూడా సన్నీకి ఫుల్ క్రేజ్ ఉంది. సినిమాల్లో ప్రత్యేక పాటలతో అభిమానులను ఉర్రూతలూగించే సన్నీ లియోనీ, ఇప్పుడు మరో విభిన్నమైన పాత్రలోకి అడుగుపెడుతోంది. ఈ సారి ఆమె నిర్మాతగా మారనుంది. బాలీవుడ్‌లో పేరుగాంచిన దర్శకుడు విక్రమాదిత్య మోత్వానే తెరకెక్కిస్తున్న ఓ అంతర్జాతీయ స్థాయి వెబ్‌సిరీస్‌కి సన్నీ నిర్మాతగా వ్యవహరించనుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టును సన్నీ సోషల్ "ఈ వెబ్‌సిరీస్ నిజ జీవిత కథ ఆధారంగా రూపొందుతుంది. నేను స్క్రిప్ట్ వినగానే ఇది ఎంతో స్ఫూర్తినిచ్చే కథగా అనిపించింది. ఇలాంటి గొప్ప కథతో నిర్మాతగా నా కొత్త జర్నీ మొదలవడం చాలా ఆనందంగా ఉంది." ఈ వెబ్‌సిరీస్ ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది. నటీనటుల ఎంపికతో పాటు, ఇతర సాంకేతిక అంశాలపై జట్టు తీవ్రంగా పని చేస్తోంది. ఈ సిరీస్‌కి అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారు. కంటెంట్‌లో వాస్తవికత, సానుభూతి, గ్లోబల్ టచ్ ఉండేలా దర్శకుడు విక్రమాదిత్య మోత్వానే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ ప్రాజెక్టుపై సన్నీ వ్యక్తిగతంగా చాలా ఆసక్తి చూపుతున్నట్లు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు వరకు గ్లామర్ రోల్స్, స్పెషల్ సాంగ్స్ ద్వారా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న సన్నీ, ఇప్పుడు ఓ సీరియస్ నిర్మాతగా మారాలని లక్ష్యంగా పెట్టుకుంది.



## సింప్లీ సూపర్బ్ లుక్స్‌లో బిగ్ బాస్ బ్యూటీ..

బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 బ్యూటీ తనూజ తన ఆట, అందంతో ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. అయితే హౌస్‌లో తనూజ మేకప్ లేకుండా ఎంతో అందంగా ఉన్న ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సింప్లీ సూపర్బ్ లుక్స్‌లో తనూజ ఎంతో క్యూట్‌గా ఉందని నెటిజన్లు అంటున్నారు. తనూజ బిగ్ బాస్ తెలుగు సీజన్ 9కు ఫస్ట్ కంటెస్టెంట్‌గా ఎంట్రీ ఇచ్చింది. ముద్ద మందారం సీరియస్ ద్వారా బుల్లితెరకు పరిచయం అయిన తనూజ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. తన అందం, అభినయంతో హౌస్‌తో పాటు బయట ఉన్న ప్రేక్షకులను కూడా తనూజ ఆకట్టుకుంది. సింప్లీ సూపర్బ్ లుక్స్‌లో మేకప్ లేకుండా తనూజ ఎంతో క్యూట్‌గా ఉన్న ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి చర్యలు

## రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణ



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వం విద్య సంస్థల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులు, సెక్టోరియల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పూర్వ ప్రాథమిక పాఠశాలల నియామకాలు, ప్రొక్యూర్ మెంట్ కమిటీ ఏర్పాటు, ఎఫ్ఎల్ఎన్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్ లు, ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో నాటిన మొక్కల వివరాలు ఇతర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఫండమెంటల్ లిటరసీ, న్యూమరసిలో జిల్లాల వారీగా ప్రగతి, జిల్లా పరిషత్, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలలో నిర్వహిస్తున్న ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా తరగతులు, లైబ్రరీల నిర్వహణ – ఏర్పాటు, బ్యాండ్ యాక్టివిటీస్, డ్రాప్ బాక్స్ క్లియరెన్స్, యు డైస్, అపార్ స్థాయి, ప్రధాన మంత్రి పోషణ్, పర్ఫార్మెన్స్ గ్రేడ్ ఇండికేటర్స్ ఇతర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి అమలు చేస్తున్న కార్యక్రమాలను జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో పకడ్బందీగా చేపట్టాలని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సముదాయం నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి దీపక్ తివారి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల అభివృద్ధి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ఇతర కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ అధికారుల సమన్వయంతో ప్రతి పాఠశాలలో అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను నిరంతరం సందర్శించి పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పాఠశాలలో నెలకొన్న సమస్యలపై పర్యవేక్షించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీడియోకాన్ఫరెన్సులో విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# నిందితులకు శిక్ష పడితేనే నేరాలు తగ్గుతాయి

= బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి
= రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



**మంచిర్యాల, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** నేరస్థులకు శిక్ష పడితేనే నేరా ల సంఖ్య తగ్గుతుందని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో పని చేస్తున్న కోర్టు డ్యూటీ అధికా రులకు, లైజనింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్థులకు శిక్ష పడేలా సాక్షులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రమేష్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, లీగల్ సెల్ ఇన్స్పెక్టర్ కృష్ణ, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు. భీమారానికి చెందిన మూగ, చెవిటి బాలికను అత్యాచారం చేసిన పోక్సో కేసులో దోషికి శిక్ష పడేందుకు కృషి చేసిన అనువాదకుడు యేసేపును శనివారం సీపీ అభినందించారు. బాధితురాలు తెలియ పరిచిన వివరాలను అనువాదం చేసి కోర్టులో వివరించారని, ఈ కేసులో దోషికి న్యాయమూర్తి 20ఏళ్ల జైలు శిక్ష, రూ. 12500 జరిమానా విధించారని, బాధితురాలికి రూ. 7లక్షల పరిహారం ఇస్తూ తీర్పునిచ్చారన్నారు. కేసులో కీలకపాత్ర పోషించిన యేసేపును సీపీ సన్మానించారు.




# సేవా దృక్పథానికి మారుపేరు ఎన్ఎస్ఎస్

**ఉట్నూర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** సేవా దృక్పథానికి మారుపేరు ఎన్ఎస్ఎస్ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీ.ప్రతాప్ సింగ్ అన్నారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవం పురస్కరించుకొని శనివారం ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, యూనిట్ 2 ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి ప్రసాద్, ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ రాజశేఖర్, డాక్టర్ రవీందర్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

**మంచిర్యాల, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య ఓ ప్రకటనలో తెలిపారు. గంజాయి, గుడుంబా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గతేడాది నవంబర్ నుంచి ఇప్పటి వరకు చేపట్టిన తనిఖీల్లో 40 గుడుంబా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 38 మందిపై చర్యలు తీసుకున్నామని ఆయన వివరించారు. మరో 44 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. అదే విధంగా నాటు సారా తరలిస్తున్న 12 వాహనాలు సీజ్ చేశామని వివరించారు.

## ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి

# అనుమతి ఇవ్వండి

## ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఖానాపూర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** మారుమూల పల్లెలోని అటవీ ప్రాంతాల దృష్ట్యా ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి అటవీశాఖ అనుమతి ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖకు ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ వినతిపత్రం అందజేశారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని పలు మండలాలకు వంతెనలు లేక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పలుచోట్ల ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని విన్నవించారు. ఉట్నూర్‌తో పాటు పెంబి మండలాల్లో మొత్తం ఆరు ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి సుమారు రూ. 18 కోట్ల నిధులు మంజూరు చేయాలని గతంలో మంత్రి సీతక్కకు విన్నవించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం అటవీ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారి డాక్టర్ సువర్ణను కలిసి ఈవిషయమై వినతిపత్రం అందజేశారు.



# భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

**నెన్నెల, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** భార్యను వేధిస్తున్న భర్తపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. నెన్నెల మండలం చిత్తాపూర్‌కు చెందిన బిటుకు నళినికి జగిత్యాల జిల్లా అంబర్ పేట గ్రామానికి చెందిన బిటుకు కిష్టయ్య అనే ట్రాక్టర్ డ్రైవర్ 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కిష్టయ్య 2022లో దుబాయికి వెళ్లాడు. తిరిగి మూడు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి భార్యపై అనుమానంతో అక్రమ సంబంధం అంటగడుతూ కొడుతూ మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. నెల క్రితం నళిని తల్లిగారిల్లు అయిన చిత్తాపూర్కు వెళ్లి ఉంటుంది. భర్త కిష్టయ్య 12న అక్కడికి వెళ్లి నళిని కొట్టి చంపుతానని బెదిరించాడు. కట్నం తీసుకు రావాలని, లేకపోతే విడాకులు ఇస్తానని వేధించాడు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# అనుమానాస్పద స్థితిలో మృతి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందినట్లు ఆదిలాబాద్ రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మండలంలోని అనుకుంట గ్రామానికి చెందిన మన్నె అశోక్ (50) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. గత 20 రోజులుగా ఛాతీనొప్పితో బాధపడుతున్నాడు. మూడు రోజులుగా కూలీ పనుల్లో భాగంగా గడ్డి మందు పిచికారీ చేశాడు. శుక్రవారం రాత్రి ఇంటి వద్ద వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు వెంటనే రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని ఎస్సై శనివారం పరిశీలించి పంచనామా నిర్వహించారు.

# ప్రజాసంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

## ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఖానాపూర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని కొలాంగూడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. పేదలకు సన్నబియ్యం అందిస్తూ సొంతింటికల నెరవేరుస్తుందన్నారు. అంతకుముందు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి పురవీధుల్లో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా ర్యాలీలో పాల్గొన్నారు. గంగపుత్ర సంఘం సభ్యులు ఎమ్మె ల్యేను కలిసి పట్టణంలోని బొడ్డానికుంట, కప్పలకుంట చెరువులు కబ్జాకు గురికాకుండా చూడాలని వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు దయానంద్, నిమ్మల రమేశ్, మాజిద్, చిన్నమ్ సత్యం, గంగనర్సయ్య, జంగిలి శంకర్, సురేశ్, శేషాద్రి, శ్రీనివాస్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఆరోపణలు అవాస్తవం'

## నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**ముథోల్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)** భైంసా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండీ. జాబీ ర్అహ్మద్ తనపై చేసిన ఆరోపణలు అవాస్తవ మని అదనపు కలెక్టర్, భైంసా మున్సిపల్ ప్రత్యే కాధికారి ఫైజాన్ అహ్మద్ అన్నారు. శనివారం భైంసాకు వచ్చిన ఆయన ఆరోపణలపై స్పందించారు. మీసేవ షాపింగ్ కాంప్లెక్స్ స్థలం తనకు చెందినదని ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారని, అధికారిగా తనవంతు బాధ్యతగా ఫిర్యాదును తీసుకుని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సదరు స్థలం విషయమై పూర్తి విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవలే అధికారులతో హియరింగ్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిర్మల్ చౌరస్తాలో శివాజీ విగ్రహం ఏర్పాటుకు గత మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం ఉన్నా.. కలెక్టర్ అనుమతి లేద న్నారు. తవ్విన గుంతతో ప్రమాదం పొంచి ఉండడంతో దాని చుట్టూ బారికేడ్స్ ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. సబ్ కలెక్టర్‌కు మున్సిపాలిటీ బాధ్యతలు అప్పగించారన్న ఆరోపణనూ కొట్టిపారేశారు.



## కలప డిపో సీజ్

**భీమారం, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని రాజలింగు కుటుంబానికి చెందిన ప్రైవేట్ కలప డిపోను మంచిర్యాల అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ రత్నాక రావు శనివారం సీజ్ చేశారు. ఇప్పటికే కలప వర్క్‌షాప్‌ను సీజ్ చేసిన అధికారులు తాజాగా డిపోను మూసివేశారు. ఇటీవల రిజర్వు ఫారెస్ట్‌లో చింతల ప్రదీప్, మగ్గిడి జీవన్, చింతల రాజ్ కుమార్‌లు 21 టేకు చెట్లు నరికి స్మగ్లింగ్ చేస్తుండగా సిబ్బంది పట్టుకున్నారు. ఆ టేకు దుంగలను రాజలింగుకి విక్రయిస్తున్నట్లు నేరం అంగీకరించారు. వాటి విలువ రూ.86,426 వేలు ఉంటుందని, ఈమేరకు కేసు నమోదు చేసి నట్లు రేంజ్ ఆఫీసర్ తెలిపారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## దేశీదారు తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారును బైక్‌లపై జిల్లాకు తరలిస్తున్న ఇద్దరిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. భీంపూర్ మండలంలోని కరంజీ గ్రామానికి చెందిన కడదారపు ఇస్తారి, వడూర్‌కు చెందిన పూణేరావులు 50 దేశీదారు సీసాలు తీసుకువస్తుండ దాడి చేసి పట్టుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. వీటివిలువ రూ.6వేల వరకు ఉంటుందన్నారు.



## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**దిలావర్‌పూర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**



మండలంలోని సిర్గాపూర్ సమీపంలో నిర్మల్-భైంసా రహ దారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. మండలంలోని న్యాలోలం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ (40) నిర్మల్ వెళ్లి రాత్రి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. సిర్గాపూర్ వద్ద ఐరన్ లోడ్‌తో ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టాడు. హుస్సేన్ తల, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళున్న ప్రయాణికులు గమనించి అతన్ని అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికి పరిస్థితి విషమించి మృ తిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



### అవగాహన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఇందుకోసం ప్రతి పోలీస్ అధికారికి చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు నేరాల నిరోధకంలో చట్టపరమైన పరిజ్ఞానం అత్యంత కీలకమని. ప్రతి పోలీస్ అధికారి చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉంటేనే బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగే అవకాశముందని పేర్కొన్నారు. సాక్ష్యాధారాల సేకరణలో జాగ్రత్తలు. దర్యాప్తు పద్ధతులు. ఎఫ్ఐఆర్ నమోదు విధానం. మైనర్ కేసులలో చైల్డ్ ప్రొటెక్షన్ చట్టాలు. మహిళలపై జరిగే నేరాల పరిధిలో అమలు చేయాల్సిన ప్రత్యేక నిబంధనలపై క్షుణ్ణంగా వివరిస్తూ పోక్సో చట్టం 2012 జువెనైల్ జస్టిస్ యాక్ట్ 2015.మోటార్ వెహికల్ యాక్ట్ 1988. విట్నెస్ ప్రొటెక్షన్ స్కీమ్ 2018.ఎన్.డి.పి.ఎస్ యాక్ట్ 1985. సైబర్ నేరాలపై అమలు చేయాల్సిన చట్టాలపొ పలు సూచనలు చేస్తూ పక్కాగా అమలు చేయాలని పోలిస్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రత్యేక సమావేశంలో జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్. సీనియర్ సివిల్ జడ్జ్ యువరాజు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ అనంతలక్ష్మి. ఆదిలాబాద్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్సీ ఎస్టీ స్పెషల్ కోర్ట్ రమణారెడ్డి.ఏఎస్పీ చిత్తరంజన్. డిఎస్పి వాహీదుద్దీన్ తదితరులున్నారు.

### జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు

## క్రీడా పారశాల పారశాల విద్యార్థినిల ఎంపిక

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు సోయం గంగు బాయి, సిడం వైష్ణవి, ఆత్రం పార్వతి హైదరాబాద్‌లోని నిజాం కళాశాల మైదానంలో ఈ నెల 26 నుంచి 29 వరకు జరగనున్న 17వ హెచ్ఎఫ్ఐ మినీ బాల బాలికల హ్యాండ్ బాల్ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుడిమేత జంగు, పాఠశాల పిడి బండ మీనా రెడ్డి తెలిపారు. విద్యార్థినీలను జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతున్న పాఠశాల హ్యాండ్ బాల్ కోచ్ అరవింద్ ను ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్



రమాదేవి, జిల్లా హ్యాండ్ బాల్ ఇంచార్జి ప్రెసిడెంట్ అరిగేలా మల్లికార్జున్ యాదవ్, గిరిజన క్రీడల అధికారి మడావి షేకు, ఏ సి ఎం ఓ ఉద్దవ్, జి సి డి ఓ శకుంతల, ఏ టీ డి ఓ, చిరంజీవి,హెచ్ డబ్ల్యు ఓ సాయి బాబా, కోచ్ లు విద్యసాగర్, తిరుమల్, సాయి, రవి, యాదగిరి, పాఠశాల అధ్యాపక బృందం అభినందించారు.



## అడవుల్లో పెద్దపులి సంచారం

### మారుమూల గ్రామాల ప్రజలు అడవుల్లోకి వెళ్లొద్దు

### బోథ్ ఎస్ఆర్వో ప్రణయ్

**బోథ్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
బోథ్ మండలంలోని అటవీ సమీపంలో పెద్దపులి సంచరించే అవకాశముందని ఎవరూ ఒంటరిగా వెళ్లకూడదని బోథ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణయ్ హెచ్చరించారు. శనివారం బోథ్ అటవీ శాఖ కార్యాలయంలో ఎఫ్ఆర్వో మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో పెద్దపులి సంచరించే అవకాశం ఉంది. ఇటీవల అన్ని గ్రామాల ప్రజల సమాచారం ప్రకారం పెద్దపులి సంచరిస్తుందన్న సమాచారం ఉందన్నారు. ప్రజలు అడవుల్లోకి వెళ్ళవద్దని పంటచేలలోకి వెళ్లేవారు కూడా గుంపులుగా వెళ్ళడమే కాకుండా సాయంత్రానికి ముందే ఇంటికి చేరుకోవాలన్నారు. పశువుల కాపరులు కూడా అడవులలోకి వెళ్ళవద్దని సూచించారు. ప్రజలు వన్యప్రాణులకు ఎలాంటి హానితలపెట్టవద్దని కరెంటు తీగలు, వలలు పెట్టడం, విష ప్రయోగంలాంటి చర్యలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. పెద్దపులి, చిరుతల పట్ల అప్రమత్తంగా ఉండాలని సమాచారం తెలిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలుపాలని కోరారు.

## నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వి.రవి నేతృత్వంలో దసరా ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా శనివారం పలు గ్రామాల్లో విస్తృత దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 40 లీటర్ల నాటుసారాయి, 200 కిలోల బెల్లం, 300 లీటర్ల పానకం స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. అక్రమ మద్యం అమ్మకాలపై 10 కేసులు నమోదు చేసి, 10 మందిని అరెస్ట్ చేసి, నిందితులను తహశీల్దార్ల ముందు బైండోవర్ చేశారు. అక్రమ మద్యం అమ్మకందారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.



# ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి





**ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రభుత్వ, ప్రైవేటు, సాంఘిక సంక్షేమ, గురుకుల, మోడల్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మొదటి సంవత్సరం అడ్మిషన్లు, యుడైస్, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం, గత సంవత్సరం ఫలితాలపై సమీక్షించారు. విద్యార్థులలో ప్రతిభను గుర్తించడానికి స్లిప్ టెస్టులు నిర్వహించాలని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. బాధ్యతాయుతంగా పనిచేస్తూ మంచి ఫలితాలను సాధించేందుకు ఆచరణాత్మక ప్రణాళిక బద్ధంగా, విద్యా బోధన పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మొదటి సంవత్సరం అడ్మిషన్లు, యుడైస్, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం, గత సంవత్సరం ఫలితాల పై సమీక్ష ,అలాగే 2025-26 విద్యా సంవత్సరం కుగాను మంచి ఫలితాలు సాధించడానికి ప్రణాళిక బద్దంగా పనిచేయడానికి కార్యోన్ముఖులు కావాలని అన్నారు. సమాజంలోని పేద, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ విద్యా వ్యవస్థను నమ్మి ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించారని, వారి ఆశలను వమ్ము చేయకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు విద్యాబోధన జరగాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రతి కళాశాలలో వారం వారం స్లిప్ టెస్ట్ లు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా విద్య బోధన జరగాలని అన్నారు. ఆ తర్వాత నెలవారి పరీక్షలు, త్రైమాసిక పరీక్షలు, అర్ధ వార్షిక పరీక్షలు, ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల యొక్క ప్రతిభ ను వెలికి తీయాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు విద్యార్థుల ఫేసియల్ రికగ్నిషన్ సిస్టం పూర్తికాని కళాశాలలో ప్రతి ప్రిన్సిపల్ ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేయాలని అన్నారు అలాగే విద్యార్థుల యుడైస్, అపార్, పెన్ నంబర్లను పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏవేని సమస్యలు తలెత్తినట్లయితే వెంటనే జిల్లా ఇంటర్ విద్యా అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని ఆన్నారు. ఈ సందర్భంగా ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి కృషి చేయడానికి సిద్ధంగా ఉంటామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జాదవ్ గణేష్ కుమార్ తేలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలకు సంబందించిన ప్రిన్సిపల్స్ వారి వారి కాలేజి లో విద్యార్థుల సంఖ్య, గైర్హాజర్, ఎంతమంది అడ్మిషన్ తీసుకున్న వివరాలను అడిగి తెలుసుకొని, విద్యార్థులు కళాశాలలకు రాకపోతే హోమ్ విసిట్ చేయాలనీ, స్టడీ అవర్స్ గ్రూపులుగా ఏర్పాటు చేసి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలన్నారు.

జాతీయ రహదారులు, ప్రాజెక్టులపై వీడియో కాన్ఫరెన్స్ శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు జాతీయ రహదారులు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్టులపై కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని భోరజ్ జంక్షన్ వద్ద వెహికల్ అండర్ పాస్ నిర్మాణానికి సంబంధించి సన్నాహక సమావేశంలో అదిలాబాద్-బేల జాతీయ రహదారిలో భాగంగా భోరజ్ జంక్షన్ వద్ద నిర్మించనున్న వెహికల్ అండర్ పాస్ అభివృద్ధిపై చీఫ్ సెక్రటరీకి అండర్ పాస్ నిర్మా ణానికి అవసరమైన స్థల సేకరణ అనుమతులపై వివరించారు.



## ఉద్యమమే ఊపిరిగా

# కొండా లక్ష్మణ్ బాపూజీ

- మూడు ఉద్యమాలను ముద్దాడిన యోధుడు లక్ష్మణ్ బాపూజీ
- ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో 1915లో జన్మించిన బాపూజీ
- నేడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

**నిరంకుశ నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడైన కొండాలక్ష్మణ్ బాపూజీ ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబరు 27న జన్మించాడు. స్వాతంత్ర్య ఉద్యమంలో మరియు నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నాడు. 1952లో ఆసిఫాబాద్ నుంచి ఎన్నికై 1971 వరకు శాసనసభ్యునిగా కొనసాగారు.**

నిరంకుశ నిజాం వ్యతిరేక మరియు తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడైన కొండాలక్ష్మణ్ బాపూజీ ఆదిలాబాదు జిల్లా వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబరు 27న జన్మించాడు. స్వాతంత్ర్య ఉద్యమంలో మరియు నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నాడు. 1952లో ఆసిఫాబాదు నుంచి ఎన్నికై 1971 వరకు శాసనసభ్యునిగా కొనసాగారు. నిఖార్సయిన తెలంగాణవాది. తెలంగాణ కోసం 1969లో మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలివేసిన నిబద్ధత కలిగిన రాజకీయవేత్త. 1969 మరియు 2009-12 తెలంగాణ ఉద్యమాలలో పాల్గొన్నాడు. రాష్ట్ర చేనేత సహకార రంగానికి కూడా కృషి చేశారు. సెప్టెంబరు 21. 2012 నాడు 97 సంవత్సరాల వయస్సులో హైదరాబాద్‌లో మరణించాడు.

**బాల్యం, విద్య :** కొండా లక్ష్మణ్ బాపూజీ 1951 సెప్టెంబరు 27న ఆదిలాబాద్ జిల్లా వాంకిడిలో జన్మించారు. 3 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడే తల్లి మరణించింది. ప్రాథమిక విద్యాభ్యాసం ఆసిఫాబాద్‌లో, న్యాయశాస్త్ర విద్య హైదరాబాద్‌లో పూర్తిచేశారు. 1940లో న్యాయవాద వృత్తి చేపట్టారు.

**స్వాతంత్ర్య, నిరంకుశ నిజాం విమోచనోద్యమం :** 1940లో న్యాయవాద వృత్తి చేసేటపుడు బాపూజీ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసేవారి తరఫున వాదించి కేసులను గెలిపించేవారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దేశమంతటా ప్రజలు ఆనందోత్సాహాలలో పాల్గొంటున్నా, తెలంగాణ ప్రజలు నిజాం నిత్య అకృత్యాలకులోనై ఉండటాన్ని చూసి విమోచన ఉద్యమంలో పోరాడారు. 1947 డిసెంబరు 4న నిజాం నవాబుమీద బాంబులు విసిరిన నారాయణ రావు పవార్ బృందంలో కొండా లక్ష్మణ్ కూడా నిందితుడే. అజ్ఞాతంలో ఉండి ప్రాణం కాపాడుకున్నారు.

**రాజకీయ జీవితం :** 1952లో బాపూజీ తొలిసారిగా ఆసిఫాబాదు నియోజకవర్గంనుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున శాసనసభకు ఎన్నికయ్యారు. 1957లో చిన్నకొండూరు నుంచి విజయం సాధించి అదే సంవత్సరం శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. 1962లో స్వల్ప తేడాతో ఓటమి చెందారు. అయితే ప్రత్యర్థి పాల్పడిన అక్రమాలపై కేసువేసి విజయం సాధించారు. 1967లో భువనగిరి నుంచి విజయం సాధించారు. కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కేబినెట్ మంత్రిగా పనిచేస్తూ 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో పదవికి రాజీనామా చేశారు. 1972లో భువనగిరినుంచి ఎన్నికయ్యారు. 1973లో పి.వి.నరసింహారావు తర్వాత సీఎం అయ్యే అవకాశం చేజారింది. ఇందిరాగాంధీ ఒప్పుకున్ననూ అప్పటి కేంద్ర హోంశాఖామంత్రి ఉమాశంకర్ దీక్షిత్, జలగం వెంగళరావు పేరు ప్రతిపాదిస్తే ఆయన్ను సీఎం చేశారు.

**వ్యక్తిగత జీవితం :** బాపూజీ భార్య శకుంతల. ఈమె వైద్యురాలు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు. ఒక కుమారుడు భారత సైన్యంలో వైమానిక దళంలో ఉంటూ దేశసేవలో వీరమరణం పొందినారు.

**జలదృశ్యం :** 1958లో సచివాలయం సమీపంలో హుస్సేన్‌సాగర్ తీరాన (ప్రస్తుత నెక్లెస్ రోడ్డుపై) భూమికొని జలదృశ్యం నిర్మించుకున్నాడు. 2002లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం దాన్ని నేలమట్టం చేయగా కోర్టు తీర్పు బాపూజీకి అనుకూలంగా వచ్చింది. ఆయన అంత్యక్రియలు 22.09.2012న జలదృశ్యంలో జరిగాయి.

### నేడు లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి...

ఆచార్య కొండా లక్ష్మణ్ బా పూజీ వర్ధంతిని పట్టణంలోని పద్మశాలీ భవనంలో ఆదివారం నిర్వహించనున్నట్లు పద్మశాలీ భవన నిర్మాణ కమిటీ సభ్యులు శని వా రం ఓ ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యులు, పద్మశాలీ బంధువులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



## బోథ్ నియోజకవర్గంలోని ఆసుపత్రుల అభివృద్ధికి కృషి చేయండి

### మంత్రి దామోదర రాజానర్సింహాకు వినతి

**బోథ్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
బోథ్ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని రాష్ట్ర ఆరోగ్య వైద్యశాఖ మంత్రి దామోదర రాజానర్సింహాను కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ కోరారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే చర్చించి ఆసుపత్రులలో కొరతగా ఉన్న వైద్యులను వైద్య సిబ్బందిని నియమించి ఆసుపత్రుల అభివృద్ధి కోసం కృషి చేయడం జరుగుతుందని తెలిపారన్నారు. ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్యం అందేలా చూడాలన్నారు.

## నేటి నుంచి దసరా సెలవులు

### ఇంటిబాట పట్టిన విద్యార్థులు

### సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు : విద్యాశాఖ

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
విద్యా సంస్థలకు ఆదివారం నుంచి అక్టోబరు 3 వరకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. దీంతో గురుకులాలు, కేజీబీవీలు, సాంఘిక సం క్షేమ హాస్టళ్లు, ప్రైవేటు హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. విద్యార్థులు తల్లిదండ్రులు, సంరక్షకులతో కలిసి ఇళ్లకు వెళ్లారు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బస్టాండ్లు సందడిగా మారాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న బోధన, నాణ్యమైన భోజనం, వసతుల గురించి ప్రధానోపాధ్యాయులు వివరించారు. విద్యార్థులను ఇంటిదగ్గర బాగా చదివించాలని చెప్పారు. బతుకమ్మ సంబరాలు ఒక రోజు ముందుగానే పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థలు సెలవుల్లో క్లాసులు నిర్వహించొద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## డిప్యూటీ సీఎంను కలిసిన టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకురాలు, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత కలిశారు. ఘర్ వాపసీ కార్యక్రమంలో భాగంగా ఇటీవల తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా సుజాత-ఆశన్న దంపతులు శనివారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎంను కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పాటుపడాలన్నారు.



## విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేయాలి



**కుభీర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లీ గ్రామంలోని కురుమల ఆరాధ్య దైవం బీరప్ప దేవుని విగ్రహాలను ధ్వంసం చేసిన ఘటనలో దుండగులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ కుభీర్ మండలం పల్సి గ్రామంలోని కురుమ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కురుమ సంఘం ఆధ్వర్యంలో శనివారం కులస్తులు స్థానిక బీరప్ప దేవాలయం ఎదుట దుండగులను అరెస్టు చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేసి ఆందోళన నిర్వహించారు. దుండగులను పట్టుకుని అరెస్టు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా కురుమ కులస్తులు ఆందోళనలకు దిగుతారని హెచ్చరించారు. ఈ సంఘటనపై నిర్మల్ జిల్లా కురుమ కులస్తులు ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు.

## గంగ నీళ్ళ జాతర పోస్టర్ల ఆవిష్కరణ



**సారంగాపూర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
మండలంలోని అడెల్లి శ్రీ మహా పోచమ్మ ఆలయ గంగ నీళ్ళ జాతర గోడపత్రాల ను శనివారం అయాల ధర్మకర్తల మండలి సభ్యులు విడుదజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 27,28 శని,ఆదివారాల్లో జరుగు జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దేవి కృపకు పాత్రులు కావాలన్నారు. ఆలయ ఛైర్మెన్ భోజగౌడ్, ధర్మకర్తలు మారుతి, లక్ష్మీ, లస్మన్న, సాయన్న, భోజన్నా, రత్నాకర్, ప్రసాద్, నర్సారెడ్డి, ప్రభాకర్ గౌడ్, అర్చలు శ్రీనివాస్ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.



## కోల్ ఇండియా ఛైర్మన్‌గా సాయిరామ్

**మందమర్రి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
కోల్ ఇండియా చైర్మన్‌గా బి.సాయిరాం ఎంపిక అయ్యారు. కోల్ ఇండియా చైర్మన్ పదవి కోసం శనివారం న్యూఢిల్లీలో ఇంటర్వ్యూలు నిర్వహించగా ఎంపిక చేసిన 10 మంది అధికారులు హాజరయ్యారు. ఇంటర్వ్యూల అనంతరం కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) నూతన ఛైర్మన్‌గా బి.సాయిరాంను పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్ (పిఈఎస్బి) సిఫార్సు చేసింది. మొత్తం పదిమంది అధికారులు కోల్ ఇండియా చైర్మన్ పదవికి పోటీపడగా కోలిండియా ఛైర్మన్ పదవి సాయిరామ్ ను వరించింది. ప్రస్తుతం నార్తర్న్ కోల్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) బాధ్యతలు నిర్వహిస్తున్న సాయిరామ్ ఛైర్మన్ గా ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా కోల్ ఇండియా ప్రస్తుత చైర్మన్ పిఎం ప్రసాద్ పదవీకాలం అక్టోబర్ 31, 2025 వరకు ఉంది.

## సింగరేణి ఉద్యోగులకు దసరా ఆఫర్

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**
సింగరేణి ఉద్యోగులకు గుడ్ న్యూస్. దసరా పండుగ వేళ సింగరేణి సంస్థ యాజమాన్యం కీలక ప్రకటన చేసింది. ఉద్యోగులకు దసరా పండుగను పురస్కరించుకుని పండుగ అడ్వాన్స్ చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం శనివారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణిలో పని చేస్తున్న అర్హులైన రెగ్యూలర్ సిబ్బందికి రూ. 25 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే, తాత్కాలిక కార్మికులకు రూ. 12,500 ఇవ్వనున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఈ మొత్తం డబ్బులను 23 జమ చేయనున్నట్లు తెలిపారు.



పూలల్లో రాణి గులాబీ.. ఈ పుష్పరాజాన్ని పూజలో వాడినా, దండలో కూర్చినా, మగువ సిగలో తురిమినా ఆ అందమే వేరు..! ఇంకా గులాబీ రేకుల నుంచి రోజ్‌వాటర్, సుగంధ తైలం తయారు చేస్తారు..! రకరకాల పదార్థాల్లోనూ వాడుతారు.. ఇంతటి ప్రాముఖ్యమున్న గులాబికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీనికనుగుణంగా కొందరు రైతులు రక రకాల గులాబీలను సాగు చేసి లాభాలను ఆర్జిస్తున్నారు. అందులో ముఖ్యమైన రకాలు, యాజమాన్య సాగు పద్ధతులు, కొన్ని ఉపయోగాలు తెలుసుకుందాం..

# గులాబీ గుబాళింపు

## రేపు గులాబీ దినోత్సవం



**హైబ్రీడ్ టీస్ :** మొక్కలు చిన్నగా ఉంటాయి. గులాబీలు మాత్రం పెద్దగా కొమ్మకు ఒకటి చొప్పున పూస్తాయి. ఉదా : గ్లాడియేటర్, అమేలి, రక్తియ, గ్రాండ్‌గాల, బకల్‌హామి, పింక్‌పాంథర్, ఆదిత్య, మదర్‌థెరిస్సా ఈ జాతికి చెందిన మొక్కలు.

**ఫ్లోరీ బాండాస్ :** గులాబీలు మధ్యంతర సైజులో గుత్తులుగా పూసి ఎక్కువ రోజులు వాడిపోకుండా ఉంటాయి. ఉదా : ల్యూటిన్, రెడ్‌ట్రెంప్, వైట్‌గోల్డ్, ఆకాశదీప్,

**మినియేచర్ :** మొక్కలు చిన్నవిగా ఉండి, అతిచిన్న గులాబీలు పూస్తాయి. ఉదా : పింక్ స్ప్రే, నర్తకి, ప్రీతి, బేబీ చాక్లెట్

**తీగ గులాబీలు :** గులాబీ మొక్కలు తీగలుగా పెరిగి పూలు చిన్నవిగా. గుత్తులుగా పూస్తాయి.

**వాతావరణం :** సూర్యరశ్మి బాగా ఉన్న వాతావరణం గులాబీ మొక్కలకు అనుకూలంగా ఉంటుంది. ఉష్ణోగ్రత హెచ్చు తగ్గు లు, పూలదిగుబడి, నాణ్యతపై ప్రభావం చూపుతాయి. పగటి ఉష్ణోగ్రత 30 డిగ్రీల సెల్సియస్, రాత్రి 15 డిగ్రీల సెల్సియస్ అనుకూలం. 18 డిగ్రీల సెల్సియస్ వద్ద గులాబీల్లో రంగు అభివృద్ధి బాగా ఉంటుంది. గులాబీలను నీడ పడని ప్రదేశాల్లో పెంచాలి. నీడ ఎక్కువగా ఉంటే తెగుళ్ల బెడద కనిపిస్తుంది. అంతేకాకుండా మొక్కలు బలహీనంగా తయారవుతాయి.

**నేలలు :** గులాబీ మొక్కలు పెంపకానికి తేలిక నేలలు అనుకూ లమైనవి. నేల ఉదజని సూచిక 6.0-6.5 ఉంటే మొక్కలకు మంచిది. బరువైన నీరు ఇంకని నల్ల నేలలు, గులాబీ సాగుకు అనుకూలంగా ఉండే ప్రదేశాలు కావు.



**నాటే దూరం :** నేల స్వభావాన్ని, రకాన్ని బట్టి 75-120 సెంటీ మీటర్ల ఎండగా నాటాలి. ఎకరాకు 6వేల నుంచి 7వేల మొక్కలు అవసరమవుతాయి.

**నాటే సమయం :** గులాబీ మొక్కలను జూన్ నుంచి జనవరి వరకు నాటుకోవచ్చు. అయితే సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో గులాబీ మొక్కలను నాటడం మంచిది.

**నీటి యాజమాన్యం :** మొక్కలను నాటిన తర్వాత కొత్త చిగుర్లు వచ్చే వరకు తేలికపాటి నీటి తడులను ఇచ్చి అటుపై అవసరాన్ని బట్టి 8-10 రోజుల వ్యవధిలో నీటి తడులు ఇవ్వాలి. డ్రిప్ పద్ధతి ద్వారా కూడా నీటి యాజమాన్యం చేపట్టి ఆదా చేయవచ్చు.

**కత్తిరింపులు :** గులాబీ పూలు కొత్త చిగుర్లపైన పూస్తాయి. కనుక తరచూ కొమ్మ కత్తిరింపులను చేయాలి. సంవత్సరానికి ఒకసారి అంటే మన రాష్ట్రంలో వర్షాకాలం అయిపోయిన తర్వాత అక్టోబర్, నవంబర్ మాసాల్లో కొమ్మలను కత్తిరించాలి. ఆరో గ్యంగా, బలంగా ఉన్న కొమ్మలపై తగినంత ఎత్తులో వెలుపలి వైపు ఉన్న మొగ్గకు సుమారు 5.మి.మీ దూరంగా పదునైన కత్తెరతో కొమ్మలను ఏటవాలుగా కత్తిరించాలి. కత్తిరించిన కొమ్మలకు బ్లైటాక్స్ పేస్ట్ పూయాలి.

**ఎరువులు :** కొమ్మలను కత్తిరించిన తర్వాత ప్రతి మొక్కకు 7-8 కిలోల పశువుల ఎరువు, 3 నుంచి 5 కిలోల వేరుశనగ, వేప పిండి చెక్క వేయాలి. పొటాష్ ఎరువులను 1:8:3 నిష్పత్తిలో ప్రతీ మొక్కకు 100 గ్రాముల చొప్పున వేయాలి. ఇదే మోతాదును రెండు మూడు దఫాలుగా వేయాలి. సూక్ష్మధాతువులైన మాంగనీస్ సల్ఫేట్ 15 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 20 గ్రాములు, చిలేటెడ్ ఇనుము 10 గ్రాములు, బొరాక్స్ 5 గ్రాములు కలిగిన మిశ్రమాన్ని రెండు గ్రాముల లీటర్ నీటి చొప్పున కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.

**పూత, దిగుబడి :** వాణిజ్యపరంగా సాగు చేసిన గులాబీలు నాటిన రెండేళ్ల తర్వాత మొదలై 7, 8 సంవత్సరాల వరకూ పూస్తాయి. మూడు సంవత్సరాల మొక్క 300ల గులాబీల దాకా పూసుంది. గులాబీలు మొగ్గగా ఉన్నప్పుడే కోయాలి.

**ఆశించే పురుగులు.. సస్యరక్షణ :**

**పెంకుపురుగు (చాపర్ బీటిల్స్) :** రాత్రిపూట గులాబీ ఆకులను తిని నష్టపరుస్తాయి. కార్బరిల్ 3 గ్రాములు లీటర్ నీటికి లేదా మిథైల్ పెరాథియాన్ 1 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**పేను :** ఉధృతి ఎక్కువగా ఉంటే, ఆకుల కొనలు, మొగ్గ నల్లగా మారుతాయి. నివారణకు డైమిథోయెట్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఎర్రనల్లి : వాతావరణం వేడిగా ఉన్న రోజుల్లో ఉధృతంగా ఉంటుంది. దీనివల్ల మొత్తం ఆకులు రాలిపోతాయి. నివారణకు 3 గ్రా. నీటిలో కరిగే గంధకం, డైకోఫాల్ 5మి.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**మొగ్గతొలుచు పురుగు :** లార్వాలు మొగ్గలను తొలుస్తాయి. దీంతో అవి విచ్చుకోవు. నివారణకు మోనోక్రొటోఫాస్, 1.6 మి.లీ. లీటర్ నీటికి డైమిథోయెట్ 2 మి.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**తెగుళ్లు.. నివారణ**

**బూడిద తెగులు :** ఆకులపై బూడిదలాంటి తెల్లటి పదార్థం ఏర్పడి ముడుచుకు పోతాయి. లేత కొమ్మల నిండా బూడిద సోకి ఎండిపోతాయి. నివారణకు డైనోకాప్, 1 మి.లీ. కార్బన్‌డై జిమ్ 1.0 గ్రా. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**నల్లమచ్చలు :** గుండ్రని నల్లమచ్చలు ఆకులకు రెండు పక్కలా వ్యాపించడం వల్ల ఆకులు రాలిపోతాయి. వర్షాకాలంలో ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. నివారణకు బావిస్టిన్ 1 గ్రా. బెనోమిల్ 1 గ్రా. క్లోరోవాలోనిల్ 2 గ్రా. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**ఎండు రోగం :** మొక్కపై భాగం నుంచి కిందికి ఎండిపోతుం ది. ఈ తెగులు ముందుగా కత్తిరించిన కొమ్మ నుంచి మొద లవుతుంది. తెగులు సోకిన కొమ్మలు నలుపు రంగుకు మారుతాయి. నివారణకు రాగి ధాతు సంబంధిత మందును (బ్లైంటాక్స్) పేస్ట్‌లాగా చేసి కత్తిరించిన ప్రదేశాల్లో పూయాలి. పచ్చిపేడ, మట్టితో కలిపిన పేస్ట్‌ను సైతం పూసి, ఈ తెగులును కొంతమేర నివారించవచ్చు.

## గులాబీతో ఉపయోగాలు ఇలా...



గులాబీలో వివిధ ఔషధ గుణాలున్నాయి. గులాబీలు విటమిన్ సీ, పెక్టిన్, ఇంకా సిట్రిక్ యాసిడ్స్ కలిగి ఉంటాయి. శరీరాన్ని చల్లబరిచే గుణం వీటిలో ఉంది. రోజ్ టీ జీర్ణ శక్తికి ఉపయోగప డుతుంది. యాంటీ బయాటిక్‌గా పనిచేస్తుంది. గులాబీ రేకులను ఉడికించడం ద్వారా వచ్చే కషాయాన్ని తాగితే గొంతు మృదువుగా ఉంటుంది. సహజ ఔషధంగా ఉపయోగపడుతుంది. గులాబీ తైలంతో మర్ధన చేసుకుంటే.. నాడీ టెన్షన్, నిద్రలేమి, ఒత్తిడి సంబంధిత వాటి నుంచి ఉపశమనం పొందవచ్చు.

గులాబీలను అందరూ ఇష్టపడతారు. సువాసనలు వెదజలేల గులాబీలను అమ్మాయిలు అమితంగా ఇష్టపడతారు. అమ్మాయిలకు అందంతో పాటు,సౌందర్య సాధనంగా ఇవి ఉపయోగపడుతున్నాయి. ముఖతేజస్సు పెరగాలంటే.. పది గులాబీ రేకలను నీళ్లలో గంటపాటు నానబెట్టి మెత్తని మిశ్రమంలా చేసుకని, దానికి రెండు టీ స్పూన్ల గులాఈ నీళ్లు, మూడు టీ స్పూన్ల తేనె వేసి కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని పావుగంట ప్రిజ్‌లో ఉంచాక వేళ్లతో ముఖంపై వలయాకారంగా పది నిమిషాల పాటు రాసుకోవాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. అంతే మిళ మిళ మెరిసే ముఖం మీ సొంతమవుతుంది.

గులాబీ పువ్వులు పొడిబాని చర్మానికి మంచి మాయిశ్చరైజర్‌లా కూడా ఉపయోగపడతాయి. అందుకోసం పది గులాబీ రేకలను మెత్తగా చేసి అందులో రెండు చెంచాల గులాబీ నీళ్లూ , రెండు చెంచాల తేనె, మూడు చుక్కల బాదం నూనె వేసి మిశ్రమంలా చేయాలి. దీన్ని ముఖంపై వలయాకారంగా రాస్తూ పావగంట తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. చర్మం మృదువుగా మారుతుంది.

ఎనిమిది గులాబీ రేకలనుమెత్తగా చేసి అందులో రెండు చెంచాల గులాబీ నీరు, చెంచా పెరుగు, చెంచా తేనె వేసి కలుపుకోవాలి. దీన్ని ముఖానికి ప్యాక్‌లా వేసి పది నిమిషాల తరువాత కడిగేయాలి. పది గులాబీలు పది పుదీనా ఆకుల్ని మెత్తని మిశమంలా చేయాలి. దీనికి చెంచా గులాబీ నీరు, గుడ్డు లోని తెల్లసొన, చెంచా మొక్కజొన్న పిండి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని పావుగంట తరువాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే ముఖంపై ముడతలు తగ్గుముఖం పడతాయి.



తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేది, ఆడబిడ్డలకు ఇష్టమైన పండుగ బతుకమ్మ. ఎంగిలిపూల నాటి నుంచి మహిళలు చేసే సందడి అంతా ఇంతాకాదు.. పూలు తేవడం, బొడ్డెమ్మలను పేర్చడం, సాయంత్రం ఆడటం.. ఇలా తొమ్మిది రోజుల పాటు తెలంగాణ లోగిళ్లల్లో కోలాహలం ఉంటుంది. పూల రూపంలో ప్రకృతిని, స్త్రీశక్తిని ఆరాధించే విశిష్టమైన పండుగ బతుకమ్మ. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాసం ముందు అమావాస్య రోజు నుంచి ఆడబిడ్డలు బతుకమ్మ పండుగ చేసుకుంటారు. తొమ్మిది రోజులు పూలతో అలంకరించి బతుకమ్మను పేరుస్తారు. పంటపొలాల్లో సీజనల్‌గా దొరికే సాధారణ పూలనే బతుకమ్మను పేర్చేందుకు వాడతారు. ప్రకృతితో మమేకమై పర్యావరణహితంగా చేసుకునే పండుగ. చిన్నా-పెద్ద, పేద-ధనిక అనే తేడా లేకుండా అందరూ కలిసి తన్మయత్వంతో గౌరమ్మను ఆరాధిస్తారు. మహిళలు ఆనందోత్సాహాలతో, ఆచార సంప్రదాయాలతో వేడుకగా జరుపునే పూలపండుగ 'బతుకమ్మ' తెలగాణ జీవనానికి నిలువెత్తు సాక్ష్యం.. చరిత్రలో  విభిన్నమైన పూలను కొలిచే ఆచారం బతుకమ్మ పండుగలోనే ఉండటం విశేషం.. ప్రకృతిలో సేకరించిన పూలను తిరిగి ప్రకృతికే సమర్పించడం బతుకమ్మ వైశిష్టానికి నిదర్శనం.. నిత్యనూతనమై, బంగారు సిరులొలికించే ప్రకృతి పండుగ బతుకమ్మను మహిళలు భక్తి పారవశ్యంతో జరుపుకోవడం ఆనవాయితీ. అశ్వయుజ శుద్ధ అమావాస్య రోజు నుంచి మహర్నవమి వరకు తొమ్మిది రోజులు జరుపుకునే పూల పర్వానికి నేడు మహిళలు ఎంగిలిపూల బతుకమ్మతో శ్రీకారం చుట్టి తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో అమ్మవారిని కొలవనున్నారు.

ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్



Bathukamma Special



# తీరొక్క పూలతో..



epaper.v6velugu.com



ప్రభాత సమాచారం బతుకమ్మ స్పెషల్

Bathukamma **Special**

బతుకమ్మ అంటేనే పువ్వుల పండుగ. పువ్వులు పంచే ఆరోగ్యం.. ప్రసాదాలు పంచుకుని తినే ఆచారం.. 'మేమంతా ఒక్కటే' అని చాటిచెప్పే చప్పట్ల సంబురం... అంతా కలిసి ఆడుతూ, పాడుకునే మురిపెం. ఈ పండుగ కోసం ఎలాంటి హంగులు, ఆర్భాటాలు అవసరం లేదు. ప్రకృతి ఇచ్చిన పూలు ఉంటే చాలు. ఇది ఆడపడుచుల ఉనికి, ఆత్మగౌరవాలకి ప్రతీక.

# తీరొక్క పూల బతుకమ్మ

పూల రూపంలో ప్రకృతిని, స్త్రీశక్తిని ఆరాధించే విశిష్టమైన పండుగ బతుకమ్మ. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాసం ముందు అమావాస్య రోజు నుంచి ఆడబిడ్డలు బతుకమ్మ పండుగ చేసుకుంటారు. తొమ్మిది రోజులు ప్రత్యేక పూలతో అలంకరించి బతుకమ్మను పేరుస్తారు. పంటపొలాల్లో సీజనల్‌గా దొరికే సాధారణ పూలనే బతుకమ్మను పేర్చేందుకు వాడతారు. ప్రకృతితో మమేకమై పర్యావరణహితంగా చేసుకునే పండుగ. చిన్నా-పెద్ద, పేద-ధనిక అనే తేడా లేకుండా అందరూ కలిసి తన్మయత్వంతో గౌరమ్మను ఆరాధిస్తారు. ఈ సీజన్‌లో రకరకాల రంగుల పూలు వికసిస్తాయి. అందులో కొన్ని సువాసనలతో ఉంటాయి. మరికొన్ని ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. వాటితో పేర్చిన బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల ఆ నీళ్లు కూడా శుభ్రం అవుతాయి.

**బతుకమ్మ తయారీ.. నిమజ్జనం**

ఒక రాగి పళ్ళెం (తాంబలం) లేదా సిబ్బిలో పూలను గుండ్రంగా రంగులు మార్చుకుంటూ పేరుస్తారు. ముందుగా గుమ్మడి ఆకులు వేసి తంగేడు పూల కట్టల వరస పేర్చుతారు. మధ్య మధ్యలో వేరే రకాల పూలు పెడతారు. గుమ్మడి ఆకులను పేర్చి మొదటి వరుసలో గుండ్రంగా తంగేడు పూలను పేరుస్తారు. తంగేడు పూలను ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా అంటే... 'మెరక తంగేడు, తుంగేర, గొబ్బిపూలు' అని పిలుస్తారు. తంగేడు తర్వాత వరుసలో వచ్చేవి గునుగు పూలు. గునుగు పూలు తెలుపు రంగులో ఉంటాయి. వీటికి ముదురు నీలం, గులాబి, ఆకుపచ్చ రంగులు అద్దుతారు. పది, పదిహేను పూలను ఒక కట్టగా కట్టి, పువ్వు కొనలను తుంచుతారు. ఆ తర్వాత బంతి, చామంతి, గన్నేరు, మందార, కలువ, తామర లాంటి పూలతో శంఖం ఆకారంలో పేరుస్తారు. మధ్యలో ఆకులు, తుంచిన కాడలను నింపుతారు. పూలు జారిపోకుండా సన్నటి నూలు దారాలను



గుమ్మడి ఆకుల కింద నుంచి తీసి ముడివేస్తారు. పేర్చిన బతుకమ్మ మీద రెండు తమలపాకులు పెట్టి పిడికెడంత పసుపు ముద్దను పెడతారు. కొందరు బతుకమ్మ మీద కాకుండా పళ్లెంలో విడిగా గౌరమ్మను ఉంచుతారు. పసుపు ముద్దకు కుంకుమ బొట్టు పెట్టి, వెలిగించిన అగరొత్తులను బతుకమ్మ పై భాగంలో గుచ్చుతారు. అలంకరించిన బతుకమ్మను ఇంట్లో దేవుడి గదిలో పెట్టి మొక్కుతారు. మధ్యాహ్నం పేర్చిన బతుకమ్మలోని పూలు సాయంత్రం వరకు వాడిపోకుండా ఉండేందుకు తడిబట్ట కప్పుతారు. సాయంకాలం అందరూ కొత్త బట్టలు కట్టుకొని.. బతుకమ్మలను తీసుకెళ్లి కూడళ్లలో పెట్టి పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆడతారు. పాటలతో గౌరీ దేవిని కీర్తిస్తారు. ఆ తర్వాత చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. తరువాత ఆ పళ్లెంలో తెచ్చిన నీళ్లతో ఆడవాళ్లు 'ఇస్తినమ్మా వాయనం.. పుచ్చుకుంటినమ్మా వాయనం' అంటూ వాయనాలు ఇచ్చి పుచ్చుకుంటారు. ఆ తర్వాత ఇంటి నుంచి తెచ్చిన ప్రసాదాలు ఒకరికొకరు పంచుకుంటారు. తొలిరోజు ఎంగిలిపూల (చిన్న బతుకమ్మ) బతుకమ్మతో మొదలై తొమ్మిదిరోజులు చేసుకునే ఈ పండుగ సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. ఈ తొమ్మిదిరోజుల్లో ఒక్కో రోజు ఒక్కో విశిష్టత ఉంటుంది.



★ ★ ★

**వైభవంగా సద్దుల బతుకమ్మ**

ఆశ్వయుజ అష్టమి (దుర్గా అష్టమి) నాడు చేసుకునే పండుగను సద్దుల బతుకమ్మ లేదా పెద్ద బతుకమ్మ అంటారు. ఆరోజు మొదటి ఎనిమిది రోజుల్లో పేర్చిన బతుకమ్మల సైజుకంటే పెద్దగా బతుకమ్మను రకరకాల పూలతో పేర్చుతారు. కొందరు ప్రతిరోజూ బతుకమ్మను పేర్చకపోయినా.. తొమ్మిదో రోజు మాత్రం కచ్చితంగా పేర్చుతారు. ఆరోజు పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఈ పండుగలో భాగం అవుతారు. సాయంత్రం పూట సుమారు గంట నుంచి రెండు గంటల వరకు ఆడిపాడాక బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేస్తారు.

**తంగేడు పూలు**

తంగేడు పువ్వు తెలంగాణ రాష్ట్ర పుష్పం. బతుకమ్మ తయారీలో మొదటి వరసలో ఉంటాయి ఈ పూలు. పసిడి వర్ణంలో మెరిసే వీటిలో ఔషధ గుణాలు చాలా ఎక్కువ. తంగేడు చెట్లు ఊరి చివరన ఉండే గుట్టల్లో పెరుగుతాయి.

**గునుగు పూలు**

గునుగు పువ్వు గడ్డి జాతికి చెందింది. బతుకమ్మ అలంకరణలో ఇది కూడా చాలా ముఖ్యమైనది. రెండో వరుసలో పెట్టే ఈ పువ్వు చాలా అందంగా ఉంటుంది. జొన్న కంకిలా కనిపించే ఈ పూలు ప్రకృతి ఒడిలో చాలా రంగుల్లో పలకరిస్తుంటాయి. బతుకమ్మ పండుగ వర్షాకాలపు చివరిలో, శీతాకాలపు తొలి రోజుల్లో వస్తుంది. కాబట్టి ఆ టైంలో గునుగు చెట్లు విరగబూస్తాయి.

**తామర పూలు**

తామర పువ్వు అందానికి, స్వచ్ఛతకు ప్రతీక. లక్ష్మీదేవి నివాసం తామర పూలు. బతుకమ్మ పేర్చిన తర్వాత చివరగా అలంకరణ కోసం ఈ పూలు పెడతారు. తామరపూలు కూడా ఎన్నో రంగుల్లో ఉంటాయి. ఏ రంగులో ఉన్నా అందంగా ఉంటాయి ఇవి.

**గుమ్మడి పువ్వు**

గుమ్మడి పువ్వుది బతుకమ్మలో మొదటిస్థానం. గుమ్మడి పువ్వునే గౌరమ్మగా భావించి పూజిస్తారు.

**కట్ల పువ్వు**

కట్ల పువ్వు నీలి రంగులో ఉంటుంది. బతుకమ్మను చూడగానే భలే ఉంది అనిపించేలా చేస్తాయి ఈ పూలు.

**బీరపువ్వు**

బీరపువ్వు పసుపు పచ్చగా ఉంటుంది. పేర్చిన బతుకమ్మకు అందాన్నిస్తుంది. బీరపువ్వు సీజనల్ ఫ్లవర్. బతుకమ్మను పేర్చేటప్పుడు నుదుటన తిలకం దిద్దినట్లుగా బీరపువ్వును పెడతారు.

**గడ్డి బంతి పూలు**

గడ్డి బంతి పూలు చూడటానికి అందంగా ఉంటాయి. ఇవి కూడా చాలా రంగుల్లో ఉంటాయి. ఈ మొక్కను గ్లోబ్ ఉసిరి, వడ మల్లి, బోడబంతి పూలు అని పిలుస్తారు.

**సీత జడ పూలు**

సీత జడ పూలనే సీతమ్మవారి జడగంటలు అని కూడా పిలుస్తారు. ముదురు రంగులో కనిపించే ఈ పూలను కూడా బతుకమ్మను పేర్చడంలో ఎక్కువగా వాడతారు. ఇవి మెత్తగా పట్టుకుచ్చుల్లా ఉంటాయి. ఈ పూలు ఎక్కడ ఉన్నా కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. ఈ పూలను నారలు, రంగుల తయారీలో వాడతారు. వీటితో పాటు వాడే బంతి, చామంతి పూలు వర్షాకాలం దోమల్ని దరిచేరనీయవు. నందివర్ధనంలో ఎన్నో ప్రత్యేక గుణాలు ఉంటాయి. పార్వతీపరమేశ్వర పూలు, టేకు, గులాబీ, సోంపు లాంటి పూలన్నీ బతుకమ్మను పేర్చడంలో వాడతారు.

★ ★ ★

మారుతున్న కాలానుగుణంగా పండుగ చేసుకునే తీరు కూడా మారిపోతూ వస్తోంది. ప్రకృతిలో దొరికే పూలు కరువయ్యాయి. ప్లాస్టిక్,



## మగవాళ్ల బతుకమ్మ

బతుకమ్మ అనగానే ఠక్కున గుర్తొచ్చేది పూలు, ఆడవాళ్లే. కానీ.. ఇక్కడ మాత్రం వెరైటీగా మగవాళ్లు చేసుకునే సంబురాలు గుర్తొస్తాయి. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని తోటపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో ప్రతి ఏడాది మగవాళ్లు కూడా బతుకమ్మ ఆడతారు. ఆడవాళ్లతో కలిసి పాటలు పాడతారు. కాకపోతే ప్రతి రోజూ కాదు. మొదటి రోజు (ఎంగిలి పూలు), చివరి రోజు (సద్దుల) రోజు మాత్రమే ఆడవాళ్లతోపాటు మగవాళ్లు కూడా చెరువు కట్ట దగ్గరకు వెళ్తారు. ఈ సంప్రదాయం ఎలా మొదలైందో తెలియదు. కానీ.. మగవాళ్లు మాత్రం భలే ఎంజాయ్ చేస్తున్నారు. అంతేకాదు మగవాళ్లు ఆడే బతుకమ్మ ఆట చూడ్డానికి చుట్టు పక్కల ఊళ్ల నుంచి ఇక్కడికి చాలామంది వస్తుంటారు.

## ఆచార సంప్రదాయాలు

**బతుకమ్మ పండుగలో మరో పరమార్థం కూడా ఉంది. తంగేడు, గునుగు, గుమ్మడి ఆకులు, పసుపు ముద్ద, బంతి లాంటి పూలను బతుకమ్మగా పేర్చి చివరకు చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆకులు, పూలు నీళ్లలో నాని మెత్తబడి కుళ్లిపోతాయి. తర్వాత నీటి అడుగుకు వెళ్లి మట్టిలో కలుస్తాయి. దీంతో ఆ మట్టి సారవంతం అవుతుంది. వేసవిలో చెరువు ఎండినప్పుడు రైతులు ఆ మట్టిని పొలాల్లో చల్లుతారు. అలా పొలాలు సారవంతం అవుతాయి. ఈ పండుగ ప్రాంతానికో రూపంలో ఉంటుంది. అడవులు ఎక్కువగా ఉన్న పూర్వ ఆదిలాబాద్ జిల్లాలో బతుకమ్మ పండుగను అంతగా జరుపుకోరు. పాలమూరు జిల్లాలోని ఒక వైపు ఊళ్లల్లోనే ఎక్కువగా చేస్తారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామంలో అక్కడి ప్రజలు దీపావళి టైంలో బతుకమ్మ పండుగ చేసుకుంటారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్నిచోట్ల అంతగా జరగనప్పటికీ గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతాల్లోని మాచర్ల, కంభంపాడు, కారెంపూడి గ్రామాల్లో ఘనంగా చేస్తారు.**

# .. ఇలా మొదలైంది

బతుకమ్మ పండగ వస్తుందంటే చాలు తెలంగాణ పల్లెల్లో తెలియని ఉత్సాహం కనిపిస్తుంటుంది. మనవాళ్లకు బతుకమ్మ అంటేనే పెద్ద సంబురం. ప్రతీ రోజు ఇళ్ళు శుభ్రపరుస్తారు. చక్కగా అలంకరించుకుంటారు. ఆడపిల్లల్ని పుట్టింటికి తీసుకొస్తారు. కొత్తగా పెళ్ళయిన ఆడపిల్లలకు అత్తగారింటి నుంచి కాగితపు పూలతో చేసిన బతుకమ్మను వాయనంగా పంపుతారు. అత్తగారింట్లో ఉండే ప్రతి ఆడపిల్లా ''ఎప్పుడు పుట్టింటికి వెళ్తానా? పుట్టింటి నుంచి పిలుపు ఎప్పుడు వస్తుందా? తనను తీసుకెళ్ళడానికి అన్నదమ్ములు ఇంకా రాలేదే..'' అని ఎదురుచూస్తుంటుంది.

ఎన్నో ప్రత్యేకతలు ఉన్న బతుకమ్మ పండుగను దాదాపు వెయ్యేళ్లుగా జరుపుకుంటున్నారని చరిత్రకారులు చెప్తున్నారు. అక్కడక్కడ దొరికిన శాసనాల ప్రకారం.. వందల ఏండ్ల నుంచే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఉందని తెలుస్తోంది. ఈ సంప్రదాయం ఎలా మొదలైందో చెప్పడానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. ''నవాబులు, భూస్వాముల పెత్తందారీతనంలో నలిగిపోతున్న తెలంగాణ గ్రామాల్లో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. వాళ్లు చేసే అకృత్యాలకు నలిగిపోయి, ఆ బాధలు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నవాళ్లను తలచుకొని తోటి మహిళలు ఈ పండుగ చేసుకునేవాళ్లు. అందుకే వాళ్లకు ప్రతీకగా పూలను పేర్చి 'బతుకవమ్మా...' అంటూ దీవిస్తూ పాటలు పాడేవాళ్లు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...' పాటల వెనుక ఉండే మర్మం ఇదే'' అని అంటున్నారు చరిత్రకారులు.

బతుకమ్మ పండుగ వెనుక ఇంకా చాలా కథలు ఉన్నాయి. బాగా ప్రాచుర్యంలో మరో కథ ఉంది. 'ఒక బాలిక భూస్వాముల అకృత్యాలను భరించలేక ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమెను ఆ ఊరి ప్రజలు చిరకాలం 'బతుకమ్మా...' అని దీవించారట. అలా ప్రతి ఏటా బతుకమ్మను కీర్తిస్తూ పండుగ జరుపుకునే సంప్రదాయం మొదలైంది. ఈ పండుగ సందర్భంగా స్త్రీలంతా వాళ్లకు ఎలాంటి ఆపదలు రాకూడదని, తమ భర్తలు, కుటుంబం చల్లగా ఉండాలనీ గౌరమ్మను వేడుకుంటారు.



**ధర్మాంగదుడు**

దక్షిణ భారతదేశాన్ని పాలించిన చోళ వంశ చక్రవర్తి ధర్మాంగదుడు సంతానం లేక ఎన్నో పూజలు పునస్కారాలు చేశాడు. ఆ పూజల వల్ల ఆయన భార్య గర్భవతి అయ్యిందట. ఆమెకు లక్ష్మీ దేవి అనుగ్రహంతో ఒక కూతురు పుట్టింది. అయితే.. ఆ బిడ్డ పసితనం నుంచే ఎన్నో గండాలు ఎదుర్కొని గట్టెక్కింది. అందుకే తల్లితండ్రులు ఆ పాపకు 'బతుకమ్మా' అని పేరుపెట్టారు. అప్పటినుంచి యువతులు మంచి భర్త దొరకాలని కోరుతూ బతుకమ్మను కొలవడం ఆనవాయితీగా వస్తోందనే మరో కథ ప్రచారంలో ఉంది.

**బృహదమ్మ**

ఒకప్పుడు తెలంగాణ ప్రాంతాన్ని రాష్ట్రకూట రాజులు పరిపాలించేవారు. వాళ్లకు వేముల వాడ చాళుక్యులు సామంతులుగా ఉండేవాళ్లు. అదే టైంలో చోళులకు, రాష్ట్రకూటులకు మధ్య యుద్ధం జరిగినప్పుడు చాళుక్యులు రాష్ట్రకూటులకు మద్దతిచ్చారు. వేములవాడలో అప్పటికే రాజరాజేశ్వర ఆలయం ఉంది. ప్రజలతోపాటు చోళరాజులు కూడా రాజరాజేశ్వరి అమ్మవారిని కొలిచేవాళ్లు. పరాంతక సుందర చోళుడు రాజరాజేశ్వరి అమ్మవారి పేరు మీదుగా తన కొడుక్కి రాజరాజ అని పేరు పెట్టుకున్నాడు. ఆ రాజరాజ చోళుడు కొడుకు రాజేంద్ర చోళుడు. రాజరాజ చోళుడు వేములవాడను పాలిస్తున్న చాళుక్య రాజు సత్యాస్రాయపై యుద్ధం చేశాడు. ఆ టైంలో రాజేంద్ర చోళుడు సేనాధిపతిగా ఉండి గెలిపించాడు. తర్వాత ఆ విజయానికి గుర్తుగా వేములవాడలోని రాజరాజేశ్వరి ఆలయాన్ని కూల్చేసి.. అందులోని భారీ శివలింగాన్ని తీసుకెళ్లి తన తండ్రికి బహుమతిగా ఇచ్చాడు. అప్పటికే రాజరాజేశ్వరికి భక్తుడైన రాజరాజ చోళుడు.. తన కొడుకు ఇచ్చిన శివలింగాన్ని ప్రతిష్ఠించడానికి క్రీస్తు శకం 1006లో తంజావూరులో బృహదేశ్వరాలయ నిర్మాణాన్ని చేపట్టాడు రాజరాజ చోళుడు. దాని నిర్మాణం 1010లో పూర్తయ్యింది. ఈ విషయాన్ని తమిళ శిలాశాసనాల్లో కూడా చోళ రాజులు చెప్పారు. రాజరాజేశ్వరి ఆలయంలోని శివలింగాన్ని పార్వతి (అప్పట్లో అమ్మవారిని బృహదమ్మగా పిలుచుకునే వాళ్లు) నుంచి వేరుచేసి తీసుకెళ్లటం తెలంగాణ ప్రజలను కలచివేసింది. దాంతో తమ బాధను చోళ రాజులకు చెప్తూ.. మేరు పర్వతంలా పూలను పేర్చి బతుకమ్మ చేయడం మొదలుపెట్టారు. అందుకే శివుడు లేని పార్వతి గురించి పాటలు పాడుతుంటారు. అలా వెయ్యేళ్ల నుంచి ప్రతి ఏడాది పండుగ చేస్తున్నారు. బతుకమ్మ పేరు కూడా 'బృహదమ్మ' అనే పేరు నుంచి వచ్చిందేనని చరిత్ర చెప్తోంది.



కాగితం పూలతో తయారుచేసిన బతుకమ్మలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో మైనింగ్‌ల వల్ల గుట్టలు కనిపించకుండా పోతున్నాయి. దాంతో గుట్టల్లో పెరిగే తంగేడు చెట్లు కనుమరుగయ్యాయి.

ఒకప్పుడు పల్లెల్లో పశువుల మేత కోసం ఏర్పాటు చేసుకున్న కంచెలు కాస్తా పంట చేన్లుగా మారాయి. దాంతో గునుగు పూలు దొరకట్లేదు. చెరువులు కబ్జా చేయడంతో బతుకమ్మకు అదనపు అందాన్నిచ్చే తామర పూలు జాడే లేకుండా పోయింది. చప్పట్లతో బతుకమ్మ పాటలు పాడే చోట డీజే సౌండ్స్ వచ్చి చేరాయి. ఒకప్పుడు బతుకమ్మ పండుగ అంటే దసరా ముందు మాత్రమే చేసుకునేటోళ్లు. కానీ.. ఇప్పుడు ఎప్పుడు పడితే అప్పుడే బతుకమ్మలు కనిపిస్తున్నాయి. ఇదివరకు రోజుల్లో బతుకమ్మలు పెట్టే స్థలాన్ని ముందుగా బాగా శుభ్రం చేసి, ఎర్రమట్టితో అలికేవాళ్లు. కానీ.. ఇప్పుడు ఎక్కడపడితే అక్కడే రోడ్ల మీదే బతుకమ్మలు పెడుతున్నారు. బతుకమ్మ మీద గౌరమ్మ(పసుపు ముద్ద)ను ఉంచడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. కానీ.. ఇప్పుడు గౌరమ్మ పెట్టడమే మానేశారు కొందరు. ఇదివరకటితో పోలిస్తే.. బతుకమ్మ పండుగ ఆర్టిఫిషియల్‌గా అనిపిస్తోందని చాలామంది చెప్తున్నారు.

**గడ్డి మందుల వల్ల**

చాలా ప్రాంతాల్లో బతుకమ్మ పేర్చడానికి పూలు దొరకని పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉందంటున్నారు. వర్షాకాలపు చివరి, శీతాకాల



# సీతంపేట.. నేతకాని బతుకమ్మ

వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామంలో ఏడాదికి రెండు సార్లు బతుకమ్మ పండుగ చేసుకుంటారు. ఇక్కడి నేతకాని కుటుంబాలు దీపావళి పండుగ నుంచి మూడు రోజుల పాటు బతుకమ్మ సంబురాలు చేస్తుంటారు. గంగ స్నానాలు చేసి రేగడి మట్టితో జోడెడ్ల బొమ్మలు తయారుచేసే సంప్రదాయంతో మొదలయ్యే ఈ సంబురాలు బతుకమ్మ నిమజ్జనంతో ముగుస్తాయి. పంటలు సమృద్ధిగా పండటంతో పాటు జనం సుఖసంతోషాలతో ఉండాలని సంప్రదాయబద్ధంగా ఉత్సవాలు చేస్తుంటారు సీతంపేట ప్రజలు.

**దీపావళి వేళ.. బతుకమ్మ కళ**

సాధారణంగా దీపావళి అంటే ఎవరికైనా గుర్తొచ్చేది లక్ష్మీదేవి నోములు, దీపాల కాంతులు, టపాసుల చప్పుళ్లు, ఇంట్లో పిండి వంటలు. కానీ సీతంపేటలో మాత్రం దీపావళి సమీపిస్తుంటేనే తంగేడు, గునుగు పూల కళ కనిపిస్తుంది. నేతకాని కుటుంబాలు బతుకమ్మలు పేర్చడానికి పోటీపడతారు. మూడు రోజుల పూజా కార్యక్రమాలు పూర్తయ్యాక వాళ్లంతా బతుకమ్మలతో ఊరి చివరనున్న చెరువు దగ్గర ఆడి, పాడతారు. దీపావళినాడు మొదటిరోజు సంప్రదాయం ప్రకారం గ్రామ సమీపంలోని గంగ(చెరువు)కు వెళ్తారు. అక్కడి నుంచి పవిత్రమైన రేగడి మట్టిని తెచ్చి జోడెడ్ల బొమ్మలు తయారుచేస్తారు. వాటిని తాము పండించిన ధాన్యంతో చేసిన పిండి వంటలతో అలంకరించి, పూజలు చేస్తారు. ఆ తర్వాత రెండో రోజు వాటిని కోలాట నృత్యాలతో పిల్లాపాపలతో ఊరేగింపుగా వెళ్లి చెరువులో నిమజ్జనం చేస్తారు. మూడో రోజు నేతకాని కుటుంబాలకు చెందిన ఆడ, మగ అందరూ కలిసి బతుకమ్మలు పేర్చి సాయంత్రం ఆడి, పాడతారు. బతుకమ్మ నిమజ్జనం తర్వాత తాము పండించిన ధాన్యంతో తయారుచేసిన పిండి వంటకాలను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటారు. ఇలా సీతంపేట నేతకాని వాళ్లు రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా బతుకమ్మ సంబరాలను దీపావళి వేళ చేసుకుంటారు.

## జగిత్యాలలో రెండుసార్లు

జగిత్యాల జిల్లాలో బతుకమ్మ పండుగ రెండుసార్లు చేసుకుంటారు. ఆడబిడ్డలు అత్తారింట్లో, తల్లిగారింట్లో.. రెండు చోట్లా పండుగ చేసుకోవాలని ఈ సంప్రదాయం మొదలుపెట్టారు. జిల్లాలోని సగం ఊళ్లలో దసరాకు ముందు పండుగ చేస్తారు. మిగతా ఊళ్లలో దసరా తర్వాత చేస్తారు. జగిత్యాల, మల్యాల, గొల్లపల్లి, పెగడపల్లి, ధర్మపురి, వెల్గటూర్, బుగ్గారం మండలాల్లో దసరాకు ఒకరోజు ముందు బతుకమ్మ పండుగ చేస్తారు. దసరా అనంతరం జగిత్యాల జిల్లాలోని రాయికల్, మేడిపల్లి, కథలాపూర్, కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లో దసరా తర్వాత పండుగ చేస్తారు.



పు తొలి రోజుల్లో బతుకమ్మ పండుగ వస్తుంది. కొన్నేళ్ల కిందట ఈ టైంలో ఎక్కడ చూసినా రకరకాల పువ్వులు రంగు రంగుల్లో పూసి పలకరించేవి. ఇప్పుడు పూల చెట్లే కనిపించడం లేదు. సాగు విస్తీర్ణం పెరగడం వల్ల కంచెలు కూడా కనిపించకుండా పోయాయి. సాగు భూముల్లో ఎలాగంటే అలా గడ్డి మందులు కొడుతున్నారు. పంట చేల దగ్గర ఒడ్లపైనే కాకుండా పంట భూముల్లో కూడా నెలకోసారి గడ్డి మందులు కొడుతున్నట్లు వ్యవసాయ శాఖాధికారులు చెప్తున్నారు. దీంతో గడ్డి జాతి మొక్కలైన గునుగు, చిట్టి బంతితోపాటు బంతి, చేమంతి, నంది వర్ధనం లాంటి పూల మొక్కలు చనిపోతున్నాయి. ఈ కారణం వల్ల కూడా బతుకమ్మ పూలు దొరకని పరిస్థితి నెలకొంది.

**మైనింగ్ వల్ల..**

బతుకమ్మను పేర్చడంలో ముఖ్యంగా తంగేడు పువ్వు వాడతారు. గతంలో ఎక్కడ చూసినా తంగేడు చెట్లు కనిపించేవి. ఊళ్లల్లో ఉండే చిన్న చిన్న గుట్టలు, ప్రభుత్వ స్థలాల్లో వేలాదిగా ఈ మొక్కలు ఉండేవి. బతుకమ్మ పండుగ వస్తుందంటే చాలు పిల్లలంతా గుంపులుగా వెళ్లి తంగేడు పువ్వు, ఆకులు కోసుకొచ్చి అక్కా చెల్లెళ్లకు ఇచ్చేవాళ్లు. అలాంటిది కొన్నేండ్లుగా రాష్ట్రంలో ఇష్టారీతిన మైనింగ్ జరుగుతోంది. అనుమతులు లేకుండానే రాళ్లు కొడుతున్నారు. మట్టి తవ్వి తీసుకెళ్తున్నారు. దాంతో గుట్టలు మాయమైపోతున్నాయి. కరీంనగర్‌లో గ్రానైట్, వరంగల్, హనుమకొండ జిల్లాలో క్వారీ మైనింగ్ ఎక్కువగా జరుగుతోంది. ఇదే కాకుండా మట్టి తవ్వకాల కోసం కూడా సర్కారు భూములను నాశనం చేస్తున్నారు. దీంతో తంగేడు చెట్లు అంతరించిపోవడంతో మహిళలు కాగితం పూల బతుకమ్మలు కొనుక్కోవాల్సి వస్తోంది. అది లేదంటే హైబ్రిడ్ పూలతో బతుకమ్మను పేర్చుతున్నారు. దాంతో పూల అమ్మకందారులకు, సింథటిక్ బతుకమ్మల తయారీదారుల బిజినెస్ పెరిగింది. పెద్ద సైజు బతుకమ్మలను కొనాలంటే వెయ్యి నుంచి 1,500 రూపాయల వరకు ఖర్చవుతోంది.

**పంట చేన్లుగా మారిన కంచెలు**

గ్రామాల్లో ఒకప్పుడు పశువుల మేత కోసం కంచె చేన్లు ఉండేవి. సర్కారు భూములే కాకుండా

## ప్లాస్టిక్ పూలు



నా చిన్నప్పుడు బతుకమ్మ పండుగ వచ్చిందంటే మా దోస్తులంతా పోటీ పడి పూలను తెచ్చేవాళ్లం. బంజరు భూములు, కంచెలు, చెరువు కట్టలపై తంగేడు, గునుగు పూలు మస్తు దొరికేవి. మా ఊరి పక్కనే చెరువులో తామర పూలు ఉండేవి. ఈత కొట్టి మరీ పూలు కోసి తెచ్చేటోళ్లం. మట్టి, మొరం కోసం చెరువులన్నీ తవ్విండ్రు. మైనింగ్ వల్ల గుట్టలు మాయమై పూల జాతి మొక్కలు కనుమరుగైనయ్. ఇప్పుడు బతుకమ్మ అంటే ప్లాస్టిక్ పూలు మాత్రమే. **- ఎలమద్రి కిరణ్.**





ఊళ్లల్లో ఉండే రైతులు కూడా ఉమ్మడిగా స్థలాలు కొని ఆవులు, గేదెలు, ఎడ్లను మేపడానికి ఖాళీగా వదిలే వాళ్లు. కాలక్రమేణా సాగు విస్తీర్ణం పెరగడంతో కంచె చేన్లు లేకుండాపోయాయి. ఒకప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా 60 నుంచి 70 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తే.. ఇప్పుడు కోటి ఎకరాలకు పైగా సాగు భూమి ఉన్నట్లుగా వ్యవసాయ శాఖ రికార్డులు చెప్తున్నాయి. దాంతో బతుకమ్మలో ఉపయోగించే తంగేడు, గునుగుపూలు, ఇతర పూల చెట్లు లేకుండా పోయాయి.

**మసకబారుతున్న బంధాలు**

బిజీ లైఫ్‌లో అందరూ ఉద్యోగాల పేరిట ఎక్కడెక్కడో స్థిరపడిపోయారు. ఈ పండుగ పుణ్యమా అని ఎక్కడెక్కడో ఉన్న వాళ్ళంతా సొంత ఊళ్లకు వెళ్తారు. అందుకే ఇది అనుబంధాల పండుగగా ఉండేది. పాత రోజుల్లో అయితే ఇంట్లో ఉండే అక్కాచెల్లెళ్ల కోసం అన్నలు, తమ్ముళ్లు ఎంతగానో కష్టపడి పూలు తెచ్చేవాళ్లు. ప్రతిరోజు తెల్లవారకముందే తట్టలు, వెదురు గంపలు పట్టుకొని పూలవేట మొదలుపెట్టేవాళ్లు. పంట చేన్ల చుట్టూ తిరిగి గుమ్మడి, బీర, సీత జడ, గడ్డి బంతి పూలు తెంపుకొని వచ్చి ఇచ్చేటోళ్లు. ఇలాంటి వాటివల్ల అక్క, తమ్ముడు, చెల్లి, అన్నల మధ్య అనుబంధం పెరిగేది. ఇప్పుడు ఇలాంటి పరిస్థితులు చాలా తక్కువనే చెప్పాలి. ఆ చిత్రం మారిపోయి ఇప్పుడు కావాల్సిన పూలన్నీ మార్కెట్‌కు వెళ్లి కొంటున్నారు.

**డీజే సౌండ్స్**

బతుకమ్మ పండుగ అనగానే అందరికీ పాటలు గుర్తుకొస్తాయి. బతుకమ్మ పాటలు విన సొంపుగా హాయిగా ఉంటాయి. సంస్కృతిని చాటి చెప్పే పండుగ ఇది. మహిళలు, పిల్లల జీవనశైలి, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, ఆడవారి కష్టసుఖాల గురించిన పాటలు పాడుతూ బతుకమ్మ ఆడతారు. ఏడేడు తరాల కథలు, గాథలను పాటల రూపంలో గుర్తు చేసుకుంటారు. కుటుంబంలోని దుఃఖాన్ని, ప్రకృతి వైపరీత్యపు కడగండ్లను నెమరేసుకుంటారు. కుటుంబ జీవనంలోని సంతోషాలను, పిల్లల ముద్దు ముచ్చట్లను, పంటచేల వయ్యారాలను, వీరుల త్యాగాలను, దేవతల దయను, శృంగారం, కరుణ, హాస్యం బతుకమ్మ పాటల్లో కలగలపి పాడుతారు.

ఇంతటి గొప్ప చరిత్ర కలిగిన బతుకమ్మ పాటల స్థానంలోకి ఇప్పుడు డీజే పాటలు వచ్చి చేరుతున్నాయి. పరిస్థితులు మారిపోయి ఈ టైంలో పువ్వులకు ఎంత డిమాండ్ ఉంటుందో డీజే పాటలకు అంతే డిమాండ్ ఏర్పడుతోంది.

## గడ్డి మందుల వాడకం పెరిగి...



ప్రకృతిలో దొరికే పూలతో బతుకమ్మ ఆడేటోళ్ళం. మా ఊళ్లో ఎక్కడ చూసినా తంగేడు, గునుగు పూల చెట్లు కనిపించేవి. పొలాలు, కంచెలు, చెరువు కట్టలపై ఎన్నో పూలు దొరికేవి. అల్లి, తామర పూలు చెరువులు, కుంటల్లో దొరికేవి. ఇప్పుడు గడ్డి మందులు, ట్రాక్టర్లు, ఇతర యంత్రాల వాడకం ఎక్కువైంది. దీంతో సహజ సిద్ధంగా ప్రకృతిలో దొరికే పూలు కరువైపోయినయ్. బంతిపూలు, కృత్రిమ పూలతో బతుకమ్మను తయారుచేసుకోవాల్సిన పరిస్థితులు వచ్చినయ్.



## పూలు 'కొని' పేరుస్తున్నం

చిన్నప్పుడు మా అన్నదమ్ములు పెత్తరమాస రోజు మా ఊళ్లో ఉండే కంచె చేన్లు, గుట్టల దగ్గరికి పోయి తంగేడు, గునుగు పూలు తెచ్చేటోళ్లు. చెరువుల కాడికిపోయి తామర పూలు, పంట చేన్లకాడికి పోయి గుమ్మడి, బీర, సీత జడ పూలు తెచ్చిచ్చేటోళ్లు. ఇప్పుడు ఇవేమి బయట దొరుకుతలేవు. మార్కెట్‌లో వచ్చే రకరకాల బంతి పూలు కొని బతుకమ్మలు పేరుస్తున్నం.

## డీజే డాన్స్‌లేంది?



బతుకమ్మ పండుగ అంటే ప్రకృతిని ఆరాధించే పండుగ. చాలా సహజత్వంతో నిండినది. ఈ పండుగ వచ్చిందంటే పల్లెటూళ్లలో సందడి ఉండేది. ఇప్పుడు ఆ ఉత్సాహం కరువైంది. బతుకమ్మ పాటలకు బదులు డీజే డాన్స్‌లు వచ్చినయ్. ఎప్పుడుపడితే అప్పుడు ఎక్కడపడితే అక్కడ బతుకమ్మను ఆడి పండుగ గొప్పతనాన్ని తగ్గిస్తున్నారు. ప్రకృతి పూల స్థానంలో కృత్రిమ పూలు వచ్చినయ్. బతుకమ్మ పండుగ సహజత్వాన్ని కోల్పోతోంది.

**- సాదు కుమారస్వామి**



పువ్వులను దైవంగా భావించి.. బతుకమ్మ పండుగ చేసే సంప్రదాయం తెలంగాణ ప్రత్యేకం. ప్రకృతి నుంచి సేకరించిన పూలను ప్రకృతికే సమర్పించుకోవాలని బతుకమ్మలను నీళ్లలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మను పేర్చేందుకు వాడే ఈ పూలలో ఔషధ గుణాలెన్నో ఉన్నాయి.

# ప్రకృతి పండుగ

తంగేడు పూలను సైంటిఫిక్‌గా 'కేసియా అరికులేటా' అంటారు. ఆడవాళ్లకు నెలసరి క్రమం తప్పకుండా రావాలంటే ఈ పూలతో టీ చేసుకుని తాగాలట. గొంతు, మూత్ర సంబంధిత సమస్యలను, కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. షుగర్ జబ్బును అదుపులో ఉంచుతాయి. తంగేడు పూల కషాయం తాగితే.. శరీరం చల్లబడుతుంది. పసుపు రంగులో మెరిసే ఈ తంగేడు పూలను నీళ్లలో వేస్తే నీళ్లలో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది.

గునుగు పూలను కోడిజుట్టు పూలు అని కూడా అంటారు. ఈ పూలను 'సెలోషియా అరిగేటియా' అంటారు. గడ్డి జాతి పువ్వే కానీ ఈ మొక్క ఆకులను కూర వండుకుంటారు. ఈ కూర తింటే నార్మల్ డెలివరీ అవుతుందట! పల్లెల్లో దీని గురించి తెలిసిన వాళ్లు ఎక్కువగా తింటారు. అయితే, మరి పూల మాటేంటి? అంటారా.. గునుగు పూలు చర్మంపై గాయాలు, పొక్కుల్ని తగ్గిస్తాయి. దగ్గు, క్షయ, డయేరియా వంటి అనారోగ్య సమస్యలకు చెక్ పెడతాయి. బీపీ కంట్రోల్‌లో ఉంటుంది. ఈ మొక్క గింజల్ని తింటే యూరినరీ ఇన్ఫెక్షన్ తగ్గుతుందంటారు. పశువులకు దాణాగా కూడా వాడతారు.

బంతి పువ్వు సైంటిఫిక్ పేరు 'క్రిసాంతిమమ్ బయాన్కొ'. ఈ బంతి పూలు క్రిమిసంహారిణిగా పనిచేస్తాయి. దోమల్ని రానీయవు. ఈ పూలకు గులాబీ అంత క్రేజ్ ఉంటుంది పల్లెల్లో. బాడీ టెంపరేచర్‌ను తగ్గిస్తాయి బంతిపూలు. బ్లడ్ సర్క్యులేషన్‌ను మెరుగుపరచడానికి వాడే మెడిసిన్‌లో వీటిని వాడతారు.



గుమ్మడి పువ్వు ను 'కుకుంబిటాపిపో' అంటారు శాస్త్రీయంగా. ఇందులో ఎ, సి విటమిన్లు ఉంటాయి. ఇది కాళ్ల నొప్పుల్ని తగ్గిస్తుంది. ప్రొస్టేట్ గ్రంథిని కాపాడుతుంది. పొడి చర్మం ఉన్న వాళ్లు వాడితే చర్మం బాగుంటుంది.

కట్ల పూలను 'జకు మోంటియా నెంటాథోమ్' అంటారు. ఈ పూలకి డయాబెటిస్, ఇన్‌ఫ్లమేషన్, క్యాన్సర్‌ను తగ్గించే గుణాలున్నాయి.

చేమంతి పూలను కాలిన గాయాలకు, దెబ్బలకు, కంటి సంబంధిత రోగాలకు మెడిసిన్‌గా వాడతారు. ఇది గాలిని శుభ్రం చేస్తుంది కూడా.

సీత జడ పూలను సిలోసియా అరిగేటియా క్రిస్టాటా అంటారు. వీటినే వాడుకలో సీతజడ పూలు లేదా పట్టుకుచ్చులు అంటారు. ఈ పూలను నారలు, రంగుల తయారీలో ఎక్కువగా వాడతారు.

రుద్రాక్ష పూల శాస్త్రీయ నామం ఎలియోకార్పస్ జనిట్రస్. ఈ పూలను కేక్, జెల్లీ తయారీల్లో వాడతారు. రుద్రాక్ష గింజల్ని నీళ్లలో వేసి, స్నానం చేస్తే చర్మ వ్యాధులు దరిచేరవట! పుండ్లు, గాయాలను కూడా నయం చేస్తుంది.

బీర పువ్వుకి లుఫా అని సైంటిఫిక్ పేరు. ఇది జలుబు, ముక్కులో వాపు, సైనస్ ప్రాబ్లమ్స్, కండరాలు, ఛాతీ నొప్పులను నయం చేస్తుంది. స్కిన్‌కి డీటాక్సిఫికేషన్‌లా పనికొస్తుంది. ఆర్థరైటిస్ తగ్గిస్తుంది. మెనుస్ట్రువల్ సైకిల్‌ని క్రమబద్ధం చేస్తుంది. పాలిచ్చే తల్లులకు పాలు బాగా వచ్చేలా చేస్తుంది. అంతేకాదు.. బీరకాయల్ని ఎండబెట్టి అందులో ఏర్పడే పీచును రంగుల్లో వాడతారు. స్నానానికి స్క్రబ్‌లా కూడా వాడతారు.

తామర పూల అందం వర్ణించలేనిది. ఔషధ గుణాల్లోనూ ఎంతో విలువైనది. సుగంధ ద్రవ్యాల తయారీకి, మలబద్ధకంతో బాధపడేవారికి తామరనూనె బాగా పనిచేస్తుంది. చాలా రకాలైన స్కిన్ అలర్జీలకు చెక్ పెడుతుంది. లివర్, బ్రెయిన్ హెల్త్‌ని కాపాడుతుంది. తామర గింజల్ని వంటలో వాడతారు. ఏదో ఒక విధంగా వీటిని రోజూ తిన్నా మంచిదేనట. దీని సైంటిఫిక్ పేరు 'నెలంబో నుసిఫెరా'.

రాఖీ పువ్వును పాండవ పువ్వు అని కూడా అంటారు. ఈ పూలను రకరకాల మెడిసిన్స్ తయారీలో వాడుతుంటారు. ఒత్తిడిని తగ్గించే మెడిసిన్స్‌లో కూడా దీన్ని వాడతారు! ఇది బాటనీ పరంగా ఫాసిఫ్లోరేసి కుటుంబానికి చెందింది.

## పూలుపేర్చడంలో సైన్స్

ఇత్తడి తాంబూలంలో గుమ్మడి ఆకులు పరిచి, వాటిమీద తంగేడు పూలు పేరుస్తారు. తర్వాత గునుగు, బంతి, చామంతి, అడవి చామంతి, ముత్యాల పువ్వు, రుద్రాక్ష, నీల గోరింట, పట్టుకుచ్చులు, కట్ల, బీర పువ్వులను బతుకమ్మలు పేర్చడానికి వాడతారు. ఈ పూలన్నింటినీ గోపురంలా పేర్చాక పైన గుమ్మడి పువ్వుతో గొడుగు పెడతారు. తమలపాకులో పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచి దీపం వెలిగిస్తారు. పసుపు క్రిమి సంహారిణి. దీపం జ్ఞానానికి సంకేతం. క్రిములను నాశనం చేసి, గాలిని శుద్ధి చేస్తుంది. బతుకమ్మలను నిమజ్జనం చేయడం వల్ల ఆ పూలలోని ఔషధగుణాలు ఆ నీటిని శుభ్రం చేస్తాయి.

# నవరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- అమ్మవారి ఆలయంలో నవరాత్రులకు సర్వం సిద్ధం..
- 9రోజులు... 9రూపాల్లో దర్శనమివ్వనున్న అమ్మవారు
- మూల నక్షత్రానికి ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి
- వివరాలు వెల్లడించిన ఆలయ ఈఓ అంజన దేవి

**ముథోల్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చదువుల తల్లి కొలువైన బాసర శ్రీజ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి ఆలయంలో శారదియా నవరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈవో అంజనదేవి తెలిపారు. శనివారం ఆలయ ఈవో అంజనా దేవి, ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 22 సోమవారం నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ఈ తొమ్మిది రోజులపాటు అమ్మవారు తొమ్మిది రూపాలలో భక్తులకు అమ్మవారు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ స్థానాచార్యులు, ప్రధానోఅర్చకులు తెలిపారు. ఈ తొమ్మిది రోజులపాటు అమ్మవారి దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈనెల 29న అమ్మవారి జన్మ నక్షత్రం అయిన మూలానక్షత్రాన్ని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్న దృష్ట్యా సాధారణ ప్రత్యేక అక్షరాభ్యాస పూజల క్యూలైన్, సర్వదర్శన ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మూల నక్షత్రం సందర్భంగా భక్తులకు చిన్నారులకు ఉచితంగా పాలు బిస్కెట్లు అరటిపండు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంతో పాటు ఉపా ఆలయాలను విద్యుత్ దీపాలు, వివిధ రకాల పూవ్వులతో అలంకరణ చేయనున్నట్లు చెప్పారు. భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్లో త్రాగునీరు వసతి కల్పింస్తామని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో వైద్య శిబిరం, బయోటాయిలెట్లు అందు బాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. నవరాత్రుల్లో భక్తుల కోసం సాంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. గోదావరి నది తీరం వద్ద పుణ్య స్నానాలకు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా అందుబాటులో గజ ఈతగాళ్ళు అందుబాటులో ఉంటారని అన్నారు. పో లీసులు, స్వచ్ఛంద సేవ సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు సేవ లు అందించనున్నారని తెలిపారు. సమావేశంలో ఆలయ ఏఈఓ సుదర్శన్ గౌడ్, సూపరింటెండెంట్ శివరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.



**మహిమాన్విత క్షేత్రం.. బాసర సరస్వతీ క్షేత్రం..**

బాసర ఆదిలాబాద్ జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రం. ముథోల్ మండలానికి చెందిన గ్రామం. బాసర నిర్మల్ పట్ట ణానికి 35కిలోమీటర్ల దూరంలో గోదావరి నది ఒడ్డున ఉం ది. నిజామాబాద్‌కు 40కి.మీదూరం. హైదరాబాద్‌కు సుమారు 205కి.మీదూరం. బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రము భారత దేశంలో గల రెండే రెండు సరస్వతీ దేవాలయాల్లో ఒకటి కాశ్మీర్‌లో ఉండగా, రెండవది బాసరలో జ్ఞాన సరస్వతీ అమ్మవారు మహాలక్ష్మి, మహాంకాళి సమేతులై కొలువు రు తీరిఉన్నారు. ఇది చాళుక్యుల కాలంలో నిర్మించబడింది. చదువుల తల్లి సరస్వతీ అమ్మవారి ఆలయానికి దేవీ శరణ్న వరాత్రి ఉత్సవాల శోభ సంతరించుకుంది. తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరుగనున్నాయి. ఒక్కో రోజు ఒక్కో రూపంలో అమ్మవారూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. నేటి నుంచి 30 వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



**తొమ్మిది రూపాల్లో అమ్మవారు...**

శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారు నవరాత్రి ఉత్సవాలలో తొమ్మిది రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నార. మొదటి రోజు శైలిపుత్రి, రెండో రోజు బ్రహ్మచారిణి, మూడో రోజు చంద్ర ఘంట, నాలుగో రోజు కుష్మాండదేవి, ఐదో రోజు స్కాందమాత, ఆరవ రోజు కాత్యాయని, ఏడో రోజు కాళరాత్రి, ఎనిమిదో రోజు మహా గౌరీ, తొమ్మిదో రోజు సిద్ధిదాత్రి అవతరాలలో అమ్మవారు పూజలందుకోనున్నారు. ఆలయ ప్రాంగాణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేకువ జామున నాలుగు గంటల నుంచి మంగళ వాయిద్యా, సుప్రభాత సేవలతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయ అధికారులు ఆలయం వద్ద గల మండపంలో ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కూచిపూడి, కచేరి, వీణా ప్రదర్శన తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు.

# అర్థరాత్రి బ్లాక్ మార్కెట్‌కు యూరియా

- కృత్రిమ కొరత సృష్టిస్తున్న ఓ ప్రైవేట్ డీలర్
- లారీని సీజ్ చేసిన పోలీసులు

**సిర్పూర్ (టి), సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గతకొంత కాలం నుంచి యూరియా లభించక జిల్లా రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. మరికొందరు డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించి.. బ్లాక్ మార్కెట్ రెట్టింపు ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదే తరహాలో శుక్రవారం అర్ధరాత్రి సిర్పూర్ (టి) మండలంలోని భూపాలపట్నం గ్రామంలో ఓ ప్రైవేట్ డీలర్‌కు సంబంధించిన యూరియా లారీ అన్ లోడ్ చేసి.. రైతులకు పంపిణీ చేస్తున్న క్రమంలో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా లారీని సీజ్ చేసి డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. అర్ధరాత్రి లారీ ద్వారా యూరియా పంపిణీ చేయడం వ్యవసాయ శాఖ అధికారులు పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కౌటాల మండలంలో యూరియా పట్టివేత.. మండలంలోని శీర్షా గ్రామంలోని శ్రీ ఆంజనేయ, శ్రీ కొండయ్య ట్రేడర్లలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన యూరియా బస్తాలను ఏవో ప్రేమలత శనివారం పట్టుకున్నారు. ఆమె కథనం ప్రకారం.. మంచిర్యాల నుంచి శీర్షా గ్రామంలోని శ్రీ ఆంజనేయ ట్రేడర్స్‌కు లారీలో 266, శ్రీ కొండయ్య ట్రేడర్స్‌కు 266 యూరియా బస్తాలు వచ్చాయి. వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వకుండా శనివారం తెల్లవారుజాము రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. అనుమతి లేకుండా పంపిణీ చేస్తున్నారనే సమాచారంతో గ్రామంలో విచారణ చేపట్టారు. శ్రీ ఆంజనేయ ట్రేడర్స్‌లో 72, శ్రీకొండయ్య ట్రేడర్స్ 46 యూరియా బస్తాలు నిల్వ ఉన్నాయి. అనుమతి లేని యూరియాను విక్రయించొద్దని డీలర్లు మల్లేశ్, తిరుపతికి ఆదేశించినట్లు ఏవో తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదించామని, ఆపైవారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

## జాతీయ స్థాయి సదస్సులో రిమ్స్ డైరెక్టర్

**రోగుల ఆరోగ్య భద్రత అనే అంశంపై ఏపీలో సదస్సు - హాజరైన జైసింగ్ రాథోడ్**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

రోగుల ఆరోగ్య భద్రత అనే అంశంపై ఆంధ్రప్రదేశలో జాతీయ స్థాయి సదస్సు శనివారం జరిగింది. గుంటూర్ జిల్లా మంగళగిరి మెడికల్ కళాశాలలో ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ హాజరయ్యారు. రోగుల రక్షణ, వైద్య,రోగ నిర్ధారణ పరీక్షలు, రక్త నమూనాల సేకరణ, చికిత్స వంటి తదితర అంశాలపైన సదస్సులో చర్చించారు.




## సింగరేణిలో సమస్యలు పరిష్కరించాలి

**ఎమ్మెల్యే కూనంనేని, ఏఐటీయూసీ నేతలు**
**సీఎంను కలిసి వినతిపత్రం అందజేత**



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

సింగరేణిలో సమస్యలు పరిష్కరిం చాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ కోరారు. శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరం 2024-25లో సాధించిన లాభాలు ప్రకటించి అందులో కార్మికులకు 35 శాతం వాటా ఇవ్వాలని కోరారు. ఎన్నోఏళ్లుగా కార్మికులు ఎదురు చూస్తున్న సొంతింటి పథకాన్ని నెరవేర్చాలన్నారు. పెర్క్‌పై పడుతున్న ఆదాయ పన్ను కంపెనే చెల్లించాలన్నారు. కోలిండియాలో మాదిరిగా సింగరేణిలో అమలు చేయాలని కోరారు. మెడికల్ బోర్డును ప్రక్షాళన చేయాలని, దీనికోసం 1981లో ఉన్న అన్ఫిట్ విధానం అమలు చేయాలన్నారు. మారుపేర్ల సమస్య పరిష్కరించాలని కంపెనీ దీనిపై అడ్వొకేట్ జనరల్ అభిప్రాయం కోరిందని, చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. కొత్తగనులు ఏర్పాటుతోపాటు కోయగూడెం, సత్తుపల్లి, తాడిచెర్ల బ్లాక్‌లు సింగరేణికే కేటాయించేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు. లాభాల వాటా విషయమై త్వరగా సెటిల్ చేస్తామని సంస్థ సీఎండీని పిలిచి డిప్యూటీ సీఎంతో సమావేశం ఏర్పాటు చేస్తానని సీఎం తెలిపినట్లు ఏఐటీయూసీ నేతలు పేర్కొన్నారు.

## ఎస్‌బిఐ-2లో గోల్డ్ లోన్ వివరాల సేకరణ

**చెన్నూర్, సెప్టెంబర్ 20 (ప్రభాత సమాచారం)**

చెన్నూర్ ఎస్బీఐ-2లో గతనెల 23ననగదు, బంగారు ఆభరణాలు, ఆపహరణకు గురైన విషయం తెలిసిందే. పోలీసులు అనతి కాలంలో బంగారు ఆభరణాలను రికవరీ చేసి బ్యాంక్‌లో భద్రపర్చారు. కోర్టు ద్వారా బాధితులకు వాటిని అప్పగించనున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా రెండు రోజుల నుంచి బాధితులు ఎంత బంగారు ఆభరణాలు తనఖా పెట్టి రుణాలు పొందారనే వివరాలు సేకరిస్తున్నారు. బాధితులు 402 మంది ఉండడంతో వివరాల సేకరణ వారం పాటు కొనసాగుతుందని సీఐ తెలిపారు.